ప్రజాశక్తి

శుక్రవారం 23 జూన్ 2023 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

జగనన్న సురక్షతో మేలేనా!?

- కుటుంబ మ్యాపింగ్ విభజనకు అవకాశం
- 11 రకాల ధ్రువపత్రాల జారీకి నిర్ణయం
- బియ్యం కార్డులు, సంక్షేమ పథకాల కోసం లక్ష మంది నిరీక్షణ

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

బియ్యం కార్డులు, పింఛన్ల పునరుద్ధరించాలని ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాదాపు లక్ష కుటుంబాల ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. ఈనెల 24 నుంచి జరగనున్న జగనన్న సురక్ష పథకం ద్వారా వీరికి కొంత వరకు మేలు జరిగే అవకాశం ఉంది. ప్రధానంగా సురక్ష కార్యక్రమం ద్వారా కుటుంబ మ్యాపింగ్ విభజనకు అవకాశం కల్పిస్తున్నట్టు చెబుతున్నారు. గతంలో ఒకే బియ్యం కార్డులో అందరూ ఉండడంతో అనర్హులైన వారు ఉన్నారంటూ ఆ కుటుంబంలోని మిగతా వారికి బియ్యం కార్డు, పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాలు నిలిపేశారు. ఇందువల్ల ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందనే నివేదికలతో సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారు.

సంక్షేమ పథకాలకు ప్రతి బంధకంగా మారిన ఆరు సూత్రాల విధానం వల్ల చాలామంది అర్హులకు పథకాలు అందడం లేదు. కుటుంబంలో ప్రభుత్వం పింఛను ఎవరున్నా వికలాంగులు, వితంతువులు, వృద్ధులకు పింఛను అందడం లేదు. ఒకే కుటుంబానికి ఒకే పింఛను విధానం వల్ల అత్త, కోడలు, వితంతువులు అయితే ఎవరో ఒకరికే పింఛన్లు అందుతున్నాయి. మరొకరికి ఇవ్వడం లేదు. కుటుంబంలో తల్లిదండ్రులు కూలి పని చేసుకుంటున్నా కుమారుడు లేదా కుమార్తె విదేశాల్లో ప్రైవేటు ఉద్యోగం చేస్తూ ఆదాయపు పన్ను చెల్లిస్తుంటే తల్లిదండ్రుల బియ్యం కార్డుని నిలిపివేయడం వల్ల వారు సంక్షేమ పథకాలకు దూరమయ్యారు. కార్డులో ఉన్న ఒక వ్యక్తి కారు ఉన్నా బియ్యం కార్డు తొలగించారు. మూడు నాలుగు పోర్షన్లకు కలిపి ఒకే మీటరు ఉండటం వల్ల 300 యూనిట్లు దాటితే వారికి కార్డు తొలగించారు. పట్టణాల్లో వెయ్యి చదరపు అడుగులకు మించిన ఇల్లు ఉన్నా రేషన్ కార్డు ఉండటం లేదు. ఇలా పలు రకాల ఆంక్షలతో రేషన్ కార్డులు తొలగించడం వల్ల అనేక సంక్షేమ పథకాలను అర్హులు కూడా పొందలేకపోతున్నారు.

ఇందుకు సంబంధించి పలు రూపాల్లో ప్రభుత్వం సురక్ష

2లో

ప్రారంభ సభలో మాట్లాడుతున్న ఎంపీ విజయసాయిరెడ్డి

నిత్య విద్యార్థులకే వెలుగులు

- నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారానే ఉన్నత స్థితి
- వర్సిటీలో ఇంకుబేషన్ సెంటర్ల అభివృద్ధికి రూ.50 లక్షలు
- మెగా జాబ్‌మేళా ప్రారంభోత్సవంలో ఎంపీ విజయసాయిరెడ్డి

ప్రజాశక్తి - ఎఎన్‌యు

జీవితంలో వెలుగు నిండాలంటే ప్రతిఒక్కరూ నిత్య విద్యార్థిగా ఉండాలని వైసిపి రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి అన్నారు. ఎపిజె.అబ్దుల్ కలామ్, సత్య నాదెళ్ల వంటి వారిని యువత ఆదర్శంగా తీసుకోవాలని, నచ్చిన రంగాల్లో పట్టుదలతో కృషి చేసి రాణించాలని చెప్పారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో రెండ్రోజులపాటు నిర్వహించే మెగాజాబ్‌మేళా గురవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపి జాబ్‌మేళాను ప్రారంభించి మాట్లాడారు. మేళాలో పాల్గొంటున్న విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఇంటర్వ్యూల్లో ఎదురయ్యే ప్రశ్నలకు బెరుకు, భయం లేకుండా ధైర్యంగా సమాధానాలు చెప్పాలన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్ అత్యంత ముఖ్యమని, తమ భావాలను ఎదుటి వ్యక్తులకు

2లో

జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయినులు

పని చేస్తున్న మమ్మల్ని తొలగించొద్దు

పల్నాడు కలెక్టర్‌కు కెజిబివి కాంట్రాక్టు ఉపాధ్యాయినుల వినతి

ప్రజాశక్తి - నరసరావుపేట

తమను విధుల నుండి తొలగించొద్దని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కెజిబివి) కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న ఉపాధ్యాయినులు కోరారు. ఈ మేరకు పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్‌ను కలెక్టరేట్‌లో 30 మంది ఉపాధ్యాయినులు గురువారం కలిసి విన్నవించారు. రాష్ట్రవ్యాప్తంగా కాంట్రాక్టు ప్రాతిపదికన ఉపాధ్యాయులు, వార్డెన్ల నియామకానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, అయితే ఇప్పటికే పని చేస్తున్న తమను కొనసాగించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సుధారాణి, అశోకరాణి, సుజాత, అనిత, అనంతలక్ష్మి, కోటేశ్వరమ్మ ఉన్నారు.

నేడు 1998 డీఎస్సీ ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-గుంటూరు

డీఎస్సీ-1998 ద్వారా ఎంపికై, మినిమం టైమ్ స్కేల్ (ఎంటిఎస్) విధానంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేస్తున్న ఉపాధ్యాయ అభ్యర్థులకు శుక్రవారం ఉదయం 10 గంటలకు డిఇఒ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని డిఇఒ పి.శైలజ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన జారీ చేశారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ఎంటిఎస్ పద్ధతిలో 227 మంది పని చేస్తున్నారని, వారికి కొత్తగా పాఠశాలలను కేటాయిస్తామని పేర్కొన్నారు. ఉప, మండల విద్యాశాఖ అధికారులు, హెచ్ఎంలు ఎంటిఎస్ ఉపాధాయులందరూ కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విధంగా చూడాలని సూచించారు.

ఛార్జీలను తగ్గించుకుంటే సబ్‌స్టేషన్ల ముట్టడి

- సంస్కరణలను ప్రభుత్వం మానుకోకుంటే మరో విద్యుత్ పోరాటం
- రౌండ్‌టేబుల్ సమావేశంలో సిపిఎం, ప్రజా సంఘాలు

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న గుంటూరు విజయ్‌కుమార్ తదితరులు

ప్రజాశక్తి - నరసరావుపేట

వివిధ ఛార్జీల పేరుతో ప్రజలపై ప్రభుత్వం మోపుతున్న విద్యుత్ భారాలను రాష్ట్ర ప్రభుత్వం మోపుతోందని, నాలుగేళ్లలో ఐదుసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ అన్నారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ స్థానిక పల్నాడు విజ్ఞాన కేంద్రంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశానికి సిఐటియు పట్టణ అధ్యక్షులు షేక్ సిలార్ మసూద్ అధ్యక్షత వహించారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ 2014 నుండి విద్యుత్ వాడకంలో వచ్చిన లోటును పూడ్చుకునేందుకు ప్రజలపై భారాలు వేయటం తుగ్లక్ పాలనను తలపిస్తోందన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని చెప్పుకుంటూనే భారాలు మోపుతున్నారని మండిపడ్డారు. విద్యుత్ ఛార్జీలు పెంపుదలపై ప్రభుత్వం వెనక్కి తగ్గకపోతే విద్యుత్ సబ్‌స్టేషన్లు ముట్టడిస్తామని హెచ్చరించారు.

2లో

ఆరు కిలోల గంజాయి స్వాధీనం

7లో

తహాశీల్దార్ కార్యాలయంలోకి నీరు

ప్రజాశక్తి - సత్తెనపల్లి

పట్టణంలో గురువారం కురిసిన భారీ వర్షానికి తహాశీల్దార్ కార్యాలయ ప్రాంగణం మొత్తం నిండిపోయింది. సిబ్బంది కనీసం కూర్చోవడానికీ వీల్లేనంతగా నీరు చేరింది. పలు దస్త్రాలు సైతం తడిశాయి. నూతన భవనం త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి వస్తేనే ఈ సమస్యలన్నీ తొలగుతాయని కార్యాలయ సిబ్బంది అంటున్నారు. అత్యవసర పనుల కోసం వస్తే ప్రజలకు ఇబ్బంది కలగకుండా, ఇప్పటికైనా ఉన్నాధికారులు స్పందించి నూతన కార్యాలయ భవనం ప్రారంభించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. మరోవైపు తాలూకా సబ్ ట్రెజరరీ కార్యాలయం నీటితో నిండిపోయింది. ఆ కార్యాలయంలో రెండే గదులు ఉండడం, దానికి తోడు ఇరుకుగా ఉండడంతో ఏం చేయాలో అధికారులకు పాలుపోవడం లేదు. మరోవైపు మొన్నటి వరకూ ఎండల తీవ్రతతో అల్లాడిన జనం తాజా వానలతో సేదదీరుతున్నారు.

డిప్యూటీ తహాశీల్దార్లకు ప్రమోషన్లు

ప్రజాశక్తి - నరసరావుపేట

పల్నాడు జిల్లాలో డిప్యూటీ తహాశీల్దార్లకు ప్రమోషన్లు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం గురువారం ప్రకటనలో తెలిపారు. డిప్యూటీ తహాశీల్దార్లుగా విధులు నిర్వహిస్తున్న కె.నాగమల్లేశ్వరరావు, ఎన్.దుర్గేశ్వరరావు, ఐ.సునీత, ఎమ్‌డి జియా ఉల్‌హక్, ఏవీ సుధాకర్, షేక్ మహమ్మద్ హుస్సేన్‌ను వరుసగా యడ్లపాడు, బెల్లంకొండ, రొంపిచర్ల, క్రోసూరు, బొల్లాపల్లి, మాచర్ల మండలాలకు కేటాయించినట్లుగా పేర్కొన్నారు.

సంక్షేమంపై ప్రజల స్పందన తెలుసుకోవాలి

ప్రజాశక్తి-తెనాలి : అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా చూస్తున్న ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌అన్నారు. స్థానిక రామకృష్ణ కవి కళాక్షేత్రంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమంపై శిక్షణా కార్యక్రమం వరుసగా రెండో రోజు కొనసాగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ నెలరోజుల పాటు జరిగే ఈ కార్యక్రమం ద్వారా సంక్షేమ పథకాలపై ప్రజల స్పందన తెలుస్తుందన్నారు. అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందని వారు ఎవరైనా ఉంటే, వారికి తక్షణమే సాయమందించేందుకు చర్యలు తీసుకునే దిశాగా కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గృహసారధులు, స్థానిక నాయకులు ఇంటింటికి తిరిగి సమస్యలు తెలుసుకోవటం జరుగుతుందని, తద్వారా అర్హులందరికీ మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ ఎం.జస్వంతరావు, తహాశీల్దార్ కె.రవిబాబు, అసిస్టెంట్ కమిషనర్ అనూష, మున్సిపల్ మేనేజర్ అప్పలరాజు, మున్సిపల్ వైస్ చైర్మన్లు అత్తోట నాగవేణి, మాలేపాటి హరిప్రసాద్, చెన్నకేశవులు, ఆర్,సుష్మరాజ్, మన్నవ ప్రభాకర్, అక్కిదాసు కిరణ్, కౌన్సిలర్లు పేరం సంజీవరెడ్డి, దుబాయ్‌బాబు పాల్గొన్నారు.

1 నుండి జగనన్న సురక్ష

ప్రజాశక్తి పొన్నూరు రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం జులై 1 నుండి 31 వరకు నిర్వహిస్తామని పొన్నూరు మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ గురువారం తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో కార్యక్రమ షెడ్యూల్‌లను ఆయన విడుదల చేశారు.

ఛార్జీలను తగ్గించుకుంటే సబ్‌స్టేషన్ల ముట్టడి

(మొదటి పేజీ తరువాయి)

2000 సంవత్సరంలో నూతన ఆర్థిక విధానాల్లో అంతర్భాగంగా ప్రపంచ బ్యాంకు షరతులకు లోబడి అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యుత్ ఛార్జీలను పెంచడానికి ప్రయత్నం చేస్తే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏడాది పాటు పెద్ద ఎత్తున ఆందోళన జరిగిందని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలోనే టిడిపి పదేళ్లపాటు అధికారం కోల్పోయిందని అనానరు. వైసిపి ప్రభుత్వం తన విధానాలు మార్చుకోకుంటే టిడిపికి పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. అన్ని రాజకీయ పార్టీలను ప్రజాసంఘాలను ప్రజలను ఏకం చేసి పెద్ద ఎత్తున ప్రభుత్వంపై ఉద్యమం చేస్తామని అన్నారు. అన్ని పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామాల్లో పెద్ద ఎత్తున ప్రచారం చేస్తామని, ప్రజల నుండి సంతకాలు సేకరిస్తామని అన్నారు. చెత్త పన్ను పేరుతో పేదలపై భారాలు వేశారని, పదేళ్లకోసారి నామమాత్రంగా పెంచాల్సిన ఆస్తి పన్నులను కేంద్ర ప్రభుత్వ విధానాలకు తలొగ్గిన అద్దె ఆధారిత పన్నును విలువ ఆధారిత పన్నుగా రాష్ట్ర ప్రభుత్వం చేసిందన్నారు. దీనివల్ల ఏడాదికి 15 శాతం పన్నులు పెంచి ప్రజలను దోపిడీ చేస్తున్నారన్నారు. జీవనోపాధి, పిల్లల చదువుల కోసం గ్రామీణ ప్రాంతాల నుండి వివిధ పట్టణానికి వచ్చే వారు ఈ భారాలకు బలవుతున్నాని, అద్దెలు పెరిగి వాటిని చెల్లించలేక గ్రామాలకు తిరిగెళు_న్నారని అనానరు. వివిధ వ్యాపార సంస్థలు కూడా పెరిగిన ఆయా పన్నుల భారాలను వినియోగదారుల నుండి వసూలు చేస్తున్నారని చెప్పారు. ఇప్పటికే పెరిగిన నిత్యావసరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఇంకా భారాలు మోపడమే వైసిపి దృష్టిలో సంక్షేమ పాలనా అని ప్రశ్నించారు.

కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు కామినేని రామారావు మాట్లాడుతూ మోడీ మెప్పు కోసం రాష్ట్ర హక్కులను రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్షాలు తాకట్టు పెడుతున్నాయని విమర్శించారు. రాష్ట్రాల హక్కులను హరించే విధంగా ఉన్న చట్టాల అమలుకూ రాష్ట్ర ప్రభుత్వం పూనుకుంటోందని అన్నారు. అనేక రాష్ట్రాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న విద్యుత్ సవరణలను మన రాష్ట్రంలో అమలు చేస్తున్నారని విమర్శించారు. శ్రామిక సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి మాట్లాడుతూ పాత మీటర్లు సమర్థవంతంగా పని చేస్తుంటే ఆ స్థానంలో స్మార్ట్ మీటర్లు ఎందుకని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ తెచ్చిన విద్యుత్ సవరణ చట్టాన్ని రాష్ట్రంలో అమలు చేసేందుకు సిఎం జగన్ వేగవంతంగా అడుగులు వేస్తున్నారని విమర్శించారు. స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియకు మొదలైతే విద్యుత్ చార్జీలు రెండింతలు పెరిగే అవకాశం ఉందన్నారు. సిఐటియు పట్టణ కార్యదర్శి ఈవూరి మస్తాన్‌రెడ్డి మాట్లాడుతూ రైతు సంక్షేమ ప్రభుత్వం అంటూనే వ్యవసాయ బోర్లకు మోటార్లు పెడుతున్నారని అన్నారు. ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటూరు మల్లీశ్వరి మాట్లాడుతూ ప్రజలపై విద్యుత్ భారాలు మోపడం,స్మార్ట్ మీటర్లు పెట్టి నగదు చెల్లించిన తర్వాతే విద్యుత్ వాడుకునే విధానాలు అమలైతే విద్యుత్ మరింత భారమవుతుందని అన్నారు. అనంతరం ఐద్వా నాయకులు ఫాతిమా మాట్లాడారు.

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న గుంటూరు విజయ్‌కుమార్ తదితరులు

విద్యుత్ సంస్కరణలపై పోరాటం

కరపత్రం ఆవిష్కరణలో గుంటూరు విజయ్‌కుమార్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెచ్చిన విద్యుత్ సంస్కరణలను ఆ పార్టీ పాలిత రాష్ట్రాల్లోనే అమలు చేయడం లేదని, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం వైసిపి తూచ తప్పకుండా అమలు చేస్తున్నారని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ విమర్శించారు. మోడీ విధానాలను అమలు చేయడం ద్వారా రాష్ట్ర ప్రజలపై మోయలేని ఛార్జీల భారాన్ని మోపుతున్నారని మండిపడ్డారు. విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ స్థానిక పల్నాడు విజ్ఞాన కేంద్రంలో కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు సిపిఎం పట్టణ కార్యదర్శి సిలార్ మసూద్ అధ్యక్షత వహించగా విజయ్ కుమార్ మాట్లాడుతూ గత నాలుగేళ్లలో ఏదోఒక పేరుతో విద్యుత్ ఛార్జీలు పెంచుతున్నారని, 2014 నుండి ఇప్పటివరకు సర్దుబాటు ఛార్జీలు రూ.6 వేలకోట్ల భారాలు మోపేందుకు సిద్ధమయ్యారని అన్నారు. యూనిట్‌కు 60 పైసలు పెంచి జులై నుండి వసూలు చేస్తారన్నారు. కస్టమర్ ఛార్జీల పేరిట రూ.10ని బిల్లు ఆధారంగా నాలుగింతలు పెంచి వసూలు చేస్తున్నారన్నారు. అదాని కంపెనీకి స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను కాంట్రాక్టు ఇచ్చిన మోడీ ఒక్కోమీటర్‌కు విడతల వారీగా రూ.13 వేల వరకు వసూలు చేసేలా ఒప్పందాలు చేసుకున్నాయని తెలిపారు. ఈ విధానాల నుండి ప్రభుత్వం వెనుక్కు తగ్గాలని, ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజల్ని కదిలించి పోరాడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.రాధాకృష్ణ, ఏపూరి గోపాలరావు, ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, నాయకులు డి.శివకుమారి, కె.హనుమంతరెడ్డి, నాగమ్మభాయ్, కె.రామారావు, జి.పిచ్చారావు, టి.శ్రీను, ఎం.హరిపోతురాజు, ఎం.ఆంజనేయులు, సాంబశివరావు, రాజకుమార్ పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో మేలేనా!?

(మొదటి పేజీ తరువాయి)

ద్వారా పరిష్కారం చూపిస్తూ వెలుసుబాటును ఇచ్చింది. దీంతో అనర్హులను కార్డు నుంచి తొలగించి మిగతా వారికి బియ్యం కార్డు పునరుద్ధరణకు అవకాశం ఇచ్చారని అధికారులు చెబుతున్నారు. ఇందుకు గాను గతంలో ఉన్న కుటుంబ మ్యాపింగ్ విభజనకు అవకాశం కల్పిస్తూ నిర్ణయం తీసుకుంటున్నారు. ఈమేరకు పలుమార్గదర్శకాలు జారీచేశారు. దీంతోపాటు సచివాలయాల ద్వారా 11 రకాల ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందక కొంత మంది సంక్షేమ పథకాలను సకాలంలో పొందలేకపోతున్నారని ప్రభుత్వం గుర్తించింది. ఇందుకోసం వారంలోగా ధ్రువీకరణ పత్రాల జారీకి అవకాశం కల్పించారు. వీటిల్లో కుల, ఆదాయ, పుట్టిన, మరణించిన, నివాస ధ్రువీకరణ, స్థలాలు, పొలాలకు మ్యూటేషన్ ఫర్ ట్రాన్సాక్షన్, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, ఈడబ్ల్యూఎస్, ఆధార్ కార్డులకు మొబైల్ నెంబరు అనుసంధానంతో కూడిన అప్‌డేట్, పుట్టిన తేదీ, కొత్త రేషన్ కార్డులు, తదితర ధ్రువీకరణ పత్రాలు ఈనెల 24 నుంచి వచ్చేనెల 23 వరకు సచివాలయాల నుంచి జారీ చేయాలని నిర్ణయించారు.

కొంత కాలంగా వాలంటీర్లు స్థానికంగా ఉండకుండా కేవలం ఒకటో తేదీన సామాజిక పింఛన్లు పంపిణీకి పరిమితమై ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని, అందువల్ల ప్రభుత్వ సేవల్లో మందగమనం పెరిగిందన్న ఫిర్యాదులు వెళ్లాయి. ఇందువల్ల సచివాలయాల నుంచి సకాలంలో సేవలు అందడం లేదన్న నివేదికల నేపథ్యంలో సురక్ష కార్యక్రమం ద్వారా ఒక్కో వాలంటీరుకు ఒక్కో సచివాలయ ఉద్యోగి, ఇతర అధికారులను కేటాయించి ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కలెక్టర్లను ఆదేశించింది.

నిత్య విద్యార్థులకే వెలుగులు

(మొదటి పేజీ తరువాయి)

అర్థవంతంగా చెప్పగలిగే సమర్థత కలిగి ఉండాలని చెప్పారు. ఎన్ని భాషల్లో కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంచుకుంటారో భవిష్యత్తులో అంత ఉన్నత స్థితికి చేరుకుంటారని, తెలుగు, ఇంగ్లీషు, హిందీ భాషలు నేర్చుకుంటే సౌలభ్యంగా ఉంటుందని తెలిపారు. అంతర్జాతీయంగా కూడా ఉద్యోగాల్లో రాణించాలంటే ఈ మూడు భాషలు అవసరమన్నారు. వివిధ రంగాల్లో రూ. 8.5 లక్షల వార్షిక వేతనం వరకు ఉద్యోగ అవకాశాలు రావడం అనేది చాలా సంతోషకర విషయమన్నారు. విద్యాభ్యాసం పూర్తయిన తర్వాత కాలాన్ని వృథా చేయకుండా ప్రణాళిక రూపొందించుకోవాలని, ప్రతిఒక్కరూ ఉద్యోగ, వ్యాపార రంగాల్లో రాణించాలని సూచించారు. ఇంటర్వ్యూల్లో ఎంపిక కానంతమాత్రాన నిరుత్సాహ పడొద్దని, కాలానుగుణంగా వస్తున్న అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని, వాటికి కావాల్సిన నూతన నైపుణ్యాలను నేర్చుకుని ఫలితాలు సాధించాలని ఉద్బోధించారు. ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, రోబోటిక్స్, వంటి అధునాతన కోర్సుల ప్రాధాన్యం పెరిగిందన్నారు. వర్సిటీలో ఇంకుబేషన్ సెంటర్ల అభివృద్ధికి తన ఎంపీ నిధుల నుండి రూ.50 లక్షల మంజూరు చేయనున్నట్లు ప్రకటించారు. జీవితంలో స్థిరపడిన, ఉన్నత స్థానాలను అధిరోహించిన వారు తాము చదువుకున్న విద్యాలయాల అభివృద్ధికి సహకరించాలని సూచించారు. అనంతరం వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.రాజశేఖర్ మాట్లాడారు. రెక్టార్ ప్రొఫెసర్ పి.వరప్రసాదమూర్తి, ఓఎస్‌డి ప్రొఫెసర్ కె.సునీత, ప్రిన్సిపాళ్లు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

నిరసన కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు

హెల్త్ అలవెన్సుల కోసం నిరసన

ప్రజాశక్తి - నరసరావుపేట

నరసరావుపేట పురపాలక సంఘం పరిధిలో పని చేస్తున్న 323 మంది మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు 3 నెలలుగా నిలిపివేసిన హెల్త్ అలవెన్సులు తక్షణమే విడుదల చేయాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు ఆందోళన చేపట్టారు. గురువారం స్థానిక పురపాలక శాఖ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. సిఐటియు నాయకులు షేక్ సిలార్ మసూద్ మాట్లాడుతూ హెల్త్ అలవెన్సులు రాకపోవడంతో మున్సిపల్ కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రస్తుతం పిల్లల చదువులు, పుస్తకాల కొనుగోళ్లు, కుటుంబ ఇతర ఖర్చులకు కార్మికులు అవస్థ పడుతున్నారని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న హెల్త్ అలవెన్సులు విడుదల చేయడం వలన ఆర్థిక వెసులుబాటు దక్కుతుందన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్మికులు టి.మల్లయ్య, ఎ.సాల్మన్, పి.ఏసు, కె.ప్రసాద్, కె.తిరుపతి, మార్తమ్మ పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎంలో ముగిసిన వర్క్‌షాప్

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఎస్ఆర్ఎం వర్సిటీలో నిర్వహిస్తున్న వర్క్‌షాప్ ముగిసింది. ముఖ్య అతిథిగా వీసీ ప్రొఫెసర్ మనోజ్‌కుమార్ అరోరా మాట్లాడారు.రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్ కుమార్, డీన్ డాక్టర్ విష్ణు పర్, డైరెక్టర్లు డాక్టర్ మోహన్, డాక్టర్ విజయ్ కుమార్, పంకజ్ బల్వేరియా, సీఎఫ్ ఏవో సుమ, ప్రొఫెసర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నిర్మల్ హృదయ్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

స్థానిక నిర్మల్ హృదయ్ వృద్ధాశ్రమాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.చంద్రమౌళీశ్వరి గురువారం సందర్శించి, న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వారితో మాట్లాడుతూ వారికి అందుతున్న సదుపాయాల గురించి ఆరా తీసి, సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే నిర్మల్ హృదయ్ వృద్ధాశ్రమంలో ఎవరికైనా రేషన్ కార్డు, ఆధార్ కార్డు లేనట్లయితే న్యాయసేవాధికార సంస్థ, టోల్‌ఫ్రీ నంబర్ 9440901048కు గానీ, రాతపూర్వకంగా సంప్రదిస్తే జిల్లా అధికారులతో మాట్లాడి చట్టపరిధిలో ఉన్న న్యాయసహాయం అందించి సమస్యను పరిష్కరిస్తామని సూచించారు. కార్యక్రమంలో నిర్మల్ హృదయ్ వృద్ధాశ్రమం నిర్వాహకులు పాల్గొన్నారు.

వృద్ధులతో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.చంద్రమౌళీశ్వరి

నేడు సింగిల్ మేజర్ సబ్జెక్ట్‌పై అవగాహన

ప్రజాశక్తి-గుంటూరు

సింగిల్ మేజర్ సబ్జెక్టుపై నేడు సెయింట్ ఆన్స్ మహిళా కాలేజిలో ఉపాధ్యాయులకు, విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ డాక్టర్ సిస్టర్ ఫాతిమా రాణి ఒక ప్రకటనలో తెలియజేశారు.జాతీయ విద్యావిధానం-2020లో భాగంగా ఈ విద్యాసంవత్సరం నుండి రాష్ట్ర ప్రభుత్వం డిగ్రీ కోర్సులైన బిఎస్సీ, బి.కాం, బిబిఎ, బిసిఎలో సింగిల్ సబ్జెక్ట్ విధానాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. కావున ఎక్కువ మంది పాల్గొని సింగిల్ మేజర్ సబ్జెక్టుపై సందేహాలు నివృత్తి చేసుకోవాలని కోరారు.

ట్రాన్స్‌ఫారాన్ని తొలగించండి మహాప్రభో..

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఇంటి నిర్మాణం చేపట్టుకుంటున్నాం. ట్రాన్సారం తొలగించండి మహాప్రభో అంటూ ఓ ఇంటి యజమాని పలుమార్లు విద్యుత్ అధికారులకు విన్నవించుకున్నాడు. ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లి గ్రామంలో తన ఇంటి నిర్మాణం చేపట్టుకునేందుకు, అడ్డుగా ఉన్న, తన ఇంటి స్థలంలో విద్యుత్ అధికారులు వేసిన ట్రాన్సార్మర్ తీసి, మరొకచోట వేయాలని అనేక మార్లు విన్నవించుకున్న పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. తీరా ఇంటి నిర్మాణ నిర్మాణం చేపడుతుంటే, ట్రాన్సారం ఉన్నచోట సిమెంట్ పిల్లర్ చుట్టూ వర్షపు నీరు చేరి, ట్రాన్సార్మ్ పక్కకు ఒరిగే పరిస్థితి ఏర్పడింది. జరగరానిది ఏమైనా జరిగితే, విద్యుత్ అంతరాయంతో పాటు, అటుగా వచ్చే ప్రజలకు విద్యుత్ ఘాతానికి గురయ్యే ప్రమాదం ఉంది. తక్షణమే తన ఇంటి నిర్మాణానికి అడ్డుగా ఉన్న ట్రాన్సారంను తొలగించాలని ఇంటి యజమాని, మాజీ ఎంపీటీసీ సభ్యులు ఆరుమళ్ళ చంద్రశేఖర రెడ్డి అధికారులను కోరుతున్నాడు.

ఎమ్‌డియు ట్రక్ ఆపరేటర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-గుంటూరు

కమిషనర్ కీర్తి చేకూరి

రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వుల ప్రకారం గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో రైస్‌కార్డు కలిగిన వారికి ఉచిత రేషన్, సరుకులు ప్రజల ఇళ్ళ వద్దకు సరఫరా చేయటానికి ఖాళీగా ఉన్న 1 ఎండియు ట్రక్ ఆపరేటర్ పోస్టు భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిఎంసి పరిధిలో 88 మంది ఎండియు ట్రక్ ఆపరేటర్స్‌ని గతంలో నోటిఫికేషన్ ద్వారా ఎంపిక చేయటం జరిగినదని, అందులో ఒకరు సదరు పోస్టుకి రాజీనామా చేశారన్నారు. సదరు ఖాళీని 6వ విడత నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాల్సి ఉన్నదని, 2023 జూన్ 1 నాటికి 21-45 ఏళ్లలోపు ఉండి, 7వ తరగతి ఉత్తీర్ణులై, నెలకు రూ.12000ల ఆదాయము కలిగి, డ్రైవింగ్ లైసెన్స్ జారీచేసిన తేదీ నుండి ప్రస్తుతం 2 ఏళు పైబడిన ముస్లిం మైనారిటీ (బిసి-ఈ) లబ్దిదారులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. 24వ తేదీ నుండి 27 వరకు జిఎంసి ప్రధాన కార్యాలయములోని ఉపాసెల్ విభాగంలో దరఖాస్తును అందజేసి రశీదు పొందాలన్నారు. దరఖాస్తుదారుని కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగంగానీ, ప్రభుత్వ పింఛను పొందుతున్న వారుగానీ, సొంతగా, వ్యాపార నిమిత్తం 4 చక్రాల వాహనము కలిగిన వారు, ఆదాయపన్ను చెల్లించేవారు ఈ పధకానికి అనర్హులు అని తెలిపారు. దరఖాస్తుకు ఆధార్ కార్డు జిరాక్స్, రేషన్ కార్డు జిరాక్స్, కుల ధవీకరణ పత్రము, ఆదాయ ధవీకరణ పత్రము, డ్రైవింగ్ లైసెన్స్ జత చేయాలన్నారు.

34, 35 డివిజన్లలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-గుంటూరు

పార్టీలకు అతీతంగా గుంటూరు నగర అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు అన్నారు. గురువారం నగరంలోని 34వ డివిజన్‌లో, 35వ డివిజన్లలో కల్వర్టుల నిర్మాణానికి ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలోని జిఎంసికి నూతన పాలకవర్గం ఏర్పడ్డాక అభివద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. నగరంలో అన్ని డివిజన్లలో పార్టీలకు అతీతంగా పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ నగర అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని చెప్పారు. విలీన గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో సుమారు రూ.75కోట్లతో అభివద్ధి పనులు జరుగుతున్నట్లు చెప్పారు. అభివృద్ధి పనుల కాంట్రాక్ట్ పొందిన సంస్థలు టెండర్ నిబంధనల ప్రకారం నిర్దేశిత సమయానికి పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బూసిరాజాలత, ఈరంటి వరప్రసాద్, 35వ డివిజన్ వైసిపి ఇన్‌చార్జి టియల్‌వి ఆంజనేయులు, ఈఈ సుందర రామిరెడ్డి, డిఈఈ రఫిక్ తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I,PEDDIBOINA MEHER LAKSHMI w/o.SHAIK SHAH(old Name) resident of 22-4-49, T B Road, Kothapeta, Tenali, Guntur District, Andhra Pradesh, I have changed my Name from PEDDIBOINA MEHER LAKSHMI to SHAIK MEHERSHAH w/o.SHAIK SHAH(New Name) Hence forth i will be know as SHAIK MEHERSHAH will be applicable for all purpose

మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 34,421
మిర్చి ఎగుమతి	: 31,617
మిర్చి నిల్వ	: 16,039

మిర్చి ధరలు

	రూపాయలలో
334	9,000 - 24,000
నెం.5	11,000 - 19,500
273	13,000-13,000
341	9,000 - 22,000
4884	--
సూపర్ 10	22,000 - 22,000
నాన్ ఎసి	
తేజ	9,800 - 24,000
బడిగె	9,000 - 25,000
దేవనూరు డీలక్స్	14,000 - 22,500
తాలుకాయలు	5,000 - 14,000
ఎసి	
334	18,500 - 22,000
341	15,000 - 23,000
తేజ	10,000 - 24,000
బడిగె	20,000 - 24,500
దేవనూరు డీలక్స్	18,500 - 23,000
తాలుకాయలు	5,000 - 13,000

అనారోగ్యంతో యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - దుగ్గిరాల

మండలంలోని పెనుమూలి గ్రామ శివారు గాంధీ నగర్‌కు చెందిన అరవపల్లి భార్గవ్(26) కడుపునొప్పి భరించలేక కలుపు మందు తాగి ఆత్మహత్యకు పాడ్పడిన సంఘటన గురువారం జరిగింది. భార్గవ్ పెదవడ్లపూడి గ్రామ సమీపంలో ఉన్న కోకోకోలా ఫ్యాక్టరీలో ఆపరేటర్‌గా పని చేస్తుంటాడు. గత మూడు సంవత్సరాల నుండి కడుపులో అల్సల్ కారణంగా నొప్పితో బాధపడుతున్నట్లు తెలిసినది. కడుపునొప్పి తాళలేక బుధవారం ఉదయం కలుపు మందు తాగగా వైద్యం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం మరణించినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. దుగ్గిరాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహారాజశ్రీ గుంటూరు 3వ అదనపు జిల్లా జడ్జి గారి కోర్టులో

EA 508/22 EA 755/17 EP 154/10

in OS 406/89

వై.సుబ్బులు నాయుడు వగైరాలు ...పిటిషనర్లు

మరియు

ఎ.నిర్మలా వగైరాలు ...రెస్పాండెంట్లు

టు

R5:కావటి మురళీధర్ S/o లేటు సూర్యనారాయణ, డోర్.నెం.7-6-921/2, 27వ లైను, శారదా కాలనీ, గుంటూరు టౌన్, గుంటూరు J C J C

ఈ నెంబరు EP లో చనిపోయిన 2వ పిటిషనరుకు వారసులు గా మిమ్ములను చేర్పించమని కోరుచూ ఈ పిటిషను దాఖలు చేయగా సదరు పిటిషనులో మీకు నోటీసు నిమిత్తం ది.25-07-2023వ తేదికి వాయిదా వేసినారు. గాన మీరు పై తెలిపిన తేది ఉదయం 10-30 గంటలకు పై కోర్టువారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకోవలయును. లేని యెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.

వాయిదా:25-07-2023

ఇట్లు
పడాల విజయకిరణ్,
ఎన్.శ్రీనివాసరావు,
పిటిషనర్ల తరుపు న్యాయవాదులు,
6/12, బ్రాడీపేట, గుంటూరు
సెల్:9490805763.

మహారాజశ్రీ గుంటూరు 3వ అదనపు జిల్లా జడ్జి గారి కోర్టులో

EA 507/22 EA 755/17 EP 154/10

in OS 406/89

వై.సుబ్బులు నాయుడు వగైరాలు
...పిటిషనర్లు

మరియు

ఎ.నిర్మలా వగైరాలు
...రెస్పాండెంట్లు

టు

R2:చదలవాడ రామారావు S/o లేటు వెంకటేశ్వరరావు

R3:కట్టా మల్లేశ్వరి W/o లేటు వసంత రావు

R4:మొగిలి శ్రీదేవి W/o ప్రసాదు.

సా॥ 7/5 శ్రీనగర్ గుంటూరు టౌన్, గుంటూరు J C J C

ఈ నెంబరు EP లో చనిపోయిన 8వ పిటిషనరుకు వారసులు గా మిమ్ములను చేర్పించమని కోరుచూ ఈ పిటిషను దాఖలు చేయగా సదరు పిటిషనులో మీకు నోటీసు నిమిత్తం ది.25-07-2023వ తేదికి వాయిదా వేసినారు. గాన మీరు పై తెలిపిన తేది ఉదయం 10-30 గంటలకు పై కోర్టువారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకోవలయును. లేని యెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.

వాయిదా:25-07-2023

ఇట్లు
పడాల విజయకిరణ్,
ఎన్.శ్రీనివాసరావు,

బహిరంగ ప్రకటన

మాక్లయింట్ అయిన గుంటూరుజిల్లా,మంగళగిరి(మం), నూతక్కి గ్రామం, డోర్.నెం.6-149, కాపురస్తుడు లేటు బొమ్మ కోటిరెడ్డి గారి కుమారుడు అర్జునరెడ్డి గారి వలన సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా, గుంటూరు జిల్లా, మంగళగిరి(మం), నూతక్కి గ్రామము తాలూకా డి.నెం.201-ఇ గా గల ఎ1-06సెంట్లు మెరక భూమిన్ని మరియు ఇతర ఆస్థులను గురించి నూతక్కి గ్రామ కాపురస్తుడు లేటు చీడిపూడి బుచ్చిరెడ్డి గారి కుమారుడు చీడిపూడి సుబ్బారెడ్డి గారు ది.09-04-1964న శ్రీ పెదపాలెం సబ్-రిజిస్ట్రారు ఆఫీసులో 3వ పుస్తకంలో దస్తావేజు నెం.10/1964గా ఒక వీలునామాను రిజిష్టర్ చేయించియున్నారు. ఆ తదుపరి చీడిపూడి సుబ్బారెడ్డి వృద్ధాప్యం వలన నూతక్కి గ్రామంలోనే తన స్వగ్రామము నందు ది.07-02-1979న మరణించినారు. ఈ వీలునామానే తన జీవితకాలపు చిట్టచివరి వీలునామా అయి వుండి ఉన్నది. ఈ వీలునామాలోని అంశముల ప్రకారం షెడ్యూలు దాఖలా ఆస్తి చీడిపూడి సుబ్బారెడ్డి రెండవ కుమార్తె లేటు పులగం వెంకటరెడ్డి గారి భార్య పులగం నాగరత్తమ్మకు చెందులాగును ఆమె మరణానంతరం మాక్లయింట్ అయిన బొమ్మ అర్జున రెడ్డికి చెందు లాగును వీలునామా వ్రాయడం అయినది. శ్రీమతి పులగం నాగ రత్తమ్మ ది.30-10-2021వ తేదిన మరణించినది ఆమె తదనంతరం వీలునామాలోని ఏర్పాటు ప్రకారం ఇల్లు, వ్యవసాయ భూమి మాక్లయింటు అయిన బొమ్మ అర్జునరెడ్డి స్వాదీన సంపూర్ణ హక్కు భుక్తములతో ఉండి వున్నది. ఇట్టి ఆస్తులలో వ్యవసాయ భూమికి సంబంధించి రెవిన్యూ కార్యాలయం వారి నుండి పట్టాదారు పాసుపుస్తకాలు, భూమి యాజమాన్యపు హక్కు పత్రములు మరియు రెవిన్యూ రికార్డులలో మాక్లయింటు అయిన బొమ్మ అర్జునరెడ్డి గారి పేరు నమోదు చేసుకొనుటకు అర్జీ పెట్టియున్నారు. దానిపై ఎవరికైనా ఏవిధమైన అభ్యంతరములు, ఆక్షేపణలు వగైరాలున్నయెడల ఈ బహిరంగ ప్రకటన వెలువడిన 15 రోజులలో శ్రీయుత తహాశీల్దారు వారి కార్యాలయము, మంగళగిరి వారికి గాని, ఈ క్రింది తెలుపబడిన న్యాయవాదులకు గాని తగిన ఆధారాలతో వ్రాతపూర్వకముగా గాని,వారియొక్క న్యాయవాదుల ద్వారా గాని తెలియపరచగలరు. లేనిచో ఎలాంటి వివాదములు లేని నిర్వివాద ఆస్థులుగా పరిగణించి తదుపరి చర్యలు నిమిత్తం అనగా పట్టాదారు పాసు పుస్తకం, భూమి యాజమాన్య హక్కు పత్రం మరియు రెవిన్యూ రికార్డులలో పేరుమార్పు కొరకు మాక్లయింటు అర్జీని ఆమోదించుదురని తెలియజేయడమైనది.

షెడ్యూలు: గుంటూరు డి॥, మంగళగిరి సబ్.డి॥ & మండలం, నూతక్కి గ్రామ తాలూకా డి.నెం.201-ఇ బాపతు య.1-06 సెంట్లు మింజుమలె శేరి మెరక భూమికి **హద్దులు. తూర్పు:** చీడిపూడి కృష్ణమోహన్ రెడ్డిగారి భూమిహద్దు, **దక్షిణం:** శ్రీ వరద వేణుగోపాల స్వామి దేవుని మాణ్యం భూమి హద్దు, **పడమర:** గోగుల సాంబి రెడ్డి గారి భూమిహద్దు,**ఉత్తరం:** గోగుల సంజీవరెడ్డి గారి భూమిహద్దు. ఈ హద్దుల మధ్య య.1-06 సెంట్లు స్థిరాస్తి శేరి మెరకభూమి,యావత్ పాత రివాజు యీజ్‌మెంట్ హక్కులతో సహా.

కాశినేడి బాజీ గంగాధరరావు, ఆరెగకూటి రామ్మోహన్ రెడ్డి
గాదె శృతి, అడ్వకేట్స్
మంగళగిరి., సెల్: 9390798999, 9989870118

ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది

గుంటూరు జిల్లా, తాటికొండ మండలం,పొన్నెకల్లు గ్రామానికి చెందిన షేక్ మీరా సాహెబ్ S/o మౌలాసాహెబ్ అను నేను యావన్మందికి తెలియజేయునది ఏమనగా నరసరావుపేట పట్టణం బరంపేట శిశుమందిర్ ప్రాంతంలో నివసిస్తున్న నా కుమార్తె వద్దకు వచ్చినాను.ఆమె వద్ద గల నాయొక్క తాడికొండ రిజిస్ట్రార్ కార్యాలయం లో 1-06-2015 న రిజిస్టర్ కాబడిన (డాక్యుమెంట్ నెం.3926/2015) ఒరిజినల్ డాక్యుమెంటును 18-06-2023న జిరాక్స్ నిమిత్తం పట్టణంలోని శివుని బొమ్మ సెంటర్‌కు నేను నా కుమార్తె వెళుతుండగా మార్గం మధ్యలో ఎక్కడో పడిపోయినది. ఎంత వెతికినను దొరకలేదు. నేను ఏ బ్యాంకు నందు కానీ బయట వ్యక్తుల వద్ద తాకట్టు పెట్టడం గాని అమ్మి ఉండటం కానీ ఏమియును చేయలేదు. సదరు డాక్యుమెంట్లు ఎవరికైనా దొరికిన యెడల పై అడ్రస్ లో తెలియపరచగలరు. అట్లు కాకుండా డాక్యుమెంట్లు దొరికిన వారు వాటిని దుర్వినియోగం పరిస్తే చట్ట పరంగా నేను తీసుకునే చర్యలకు బాధ్యులగుదురు.

ఇట్లు.
షేక్ మీరా సాహెబ్.
ఫోన్ : 9052165801

ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది

పల్నాడు జిల్లా, నరసరావుపేట పట్టణం, భరంపేట,శిశుమందిర్ ప్రాంతానికి చెందిన దూదేకుల నూర్ బాషా భానుష బేగం w/o నాగూర్ మీరావలి అను నేను యావన్మందికి తెలియజేయునది ఏమనగా 30-07-2014న తాడికొండ రిజిస్ట్రార్ కార్యాలయం లో రిజిస్టర్ కాబడిన (డాక్యుమెంట్ నెం.3521/2014) ఒరిజినల్ డాక్యుమెంటును 18-06-2023న జిరాక్స్ నిమిత్తం పట్టణంలోని శివుని బొమ్మ సెంటర్‌కి వెళు తుండగా మార్గం మధ్యలో ఎక్కడో పడిపోయినది. ఎంత వెతికినను దొరకలేదు. నేను ఏ బ్యాంకు నందు కానీ బయట వ్యక్తుల వద్ద తాకట్టు పెట్టడం గాని అమ్మి ఉండటం కానీ ఏమియును చేయలేదు. సదరు డాక్యుమెంట్లు ఎవరికైనా దొరికిన పై అడ్రస్ లో తెలియపరచగలరు. అట్లు కాకుండా డాక్యుమెంట్లు దొరికిన వారు వాటిని దుర్వినియోగం పరిస్తే చట్ట పరంగా నేను తీసుకునే చర్యలకు బాధ్యులగుదురు.

ఇట్లు.
డి.భానుష బేగం.
8639472741

యడ్లపాడు మండలంలో వర్షం

పలుచోట్ల భారీవర్షాలు

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండలంలో గురువారం ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. పొలాలు కాల్వలను తలపించాయి. మండల కేంద్రమైన ముప్పాళ్లలో డ్రెయినేజీలు పొంగి మురుగునీరు రోడ్డు మీదకి ప్రవహించింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

ప్రజాశక్తి - సత్తెనపల్లి, యడ్లపాడు

సత్తెనపల్లి పట్టణంలో బుధవారం రాత్రి, గురువారం రాత్రి భారీ వర్షం నమోదైంది. పలువార్డుల్లోని రోడ్లపై వర్షపునీరు భారీగా చేరింది. యడ్లపాడులోని పలు మండలాల్లోనూ భారీ వర్షం కురిసింది.

కొంకేరు బ్రిడ్జి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వినుకొండ

మండలంలోని ఏనుగుపాలెంలోని కొంకేరు వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు గురువారం పరిశీలించారు. కొంకేరు వాగుతో ప్రజల పడుతున్న ఇబ్బందులను, జరిగిన ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని ఈ బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. పనులు 90 శాతం పూర్తయ్యాయని, మిగతా పనులనూ త్వరగా పూర్తి చేసి ప్రారంభిస్తామని ఎమ్మెల్యే చెప్పారు. ఇదిలా ఉండగా మండలంలోని పెద్దకంచర్లలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రెండోరోజు ప్రచారంలో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే పాల్గొన్నారు.

ఆర్‌బీకేలతో బహుళ ప్రయోజనాలు

ప్రజాశక్తి - రెంటచింతల

రైతు భరోసా కేంద్రాలతో రైతులకు బహుళ ప్రయోజనాలు కలుగుతాయని, వాటిని ప్రతిరైతూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయిమార్కొండరెడ్డి అన్నారు. మండలంలోని మిట్టగుడిపాడు, గోలి గ్రామాల పరిధిలో రైతు భరోసా కేంద్రాలను ఆయన గురువారం సందర్శించి, రైతులతో సమావేశమయ్యారు. పచ్చిరొట్ట పైర్లు సాగుతో రసాయనిక ఎరువుల వాడకం తగ్గించుకోవచ్చని, తద్వారా పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయని అన్నారు. కౌలు రైతులు పంట సాగు హక్కు పత్రాలను పొందాలని సూచించారు. కార్డులు పొందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కౌల్దార్లకు పంటల బీమా, రైతు భరోసా, పంట నష్టపరిహారం లభిస్తాయని అన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి.బ్రహ్మారెడ్డి, ఇఒపిఆర్‌డి రామచంద్రరావు, సర్పంచులు జి.వెంకటేశ్వర్‌రెడ్డి, ఎం.చంద్రం, ఎంపిటిసి సంపూర్ణమ్మ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సాయిమార్కొండరెడ్డి

2650 ప్లాట్లలో ఒక్క ఇల్లే పూర్తి!

వసతుల్లేక నిర్మాణాలకు లబ్ధిదార్ల వెనుకంజ - నీటి వసతి కష్టమే - మెరకలకే అధిక ఖర్చు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

మున్సిపాలిటీలో విలీనమైన పసుమర్రు 3 కిలోమీటర్ల దూరంలోని గుదేవారిపాలెం పంచాయతి పరిధిలో వేసిన జగనన్న ఇళ్ల స్థలాల్లో నిర్మాణం స్తంభించింది. ఇక్కడ మొత్తం 60 ఎకరాల్లో రెండు లే అవుట్లు వేశారు. వీటిల్లో 2650 ప్లాట్లు ఉన్నాయి. వీటిల్లో గ్రామీణులకు 300 ప్లాట్లు ఇవ్వగా 2156 ప్లాట్లను పట్టణ పేదలకు పంపిణీ చేశారు. 194 ప్లాట్లను ఇంకా ఎవరికీ పంపిణీ చేయలేదు.

ఈ ప్లాట్లను పంపిణీ చేసి రెండేళ్లయినా ఇప్పటి వరకు ఒక్కటంటే ఒక్క ఇంటి నిర్మాణమే పూర్తయింది. ఒక ఇంటికి పునాది కోసం గుంతలు తీసి వదిలేశారు. ఏడు ఇళ్లు శ్లాబు దశలో ఉండగా మరో 23 ఇళ్లకు పునాదికి బీములు వేశారు. పట్టణానికి దూరంగా ఉండడం, బాగా పల్లపు ప్రాంతం కావడంతో ఇక్కడ ఇంటి నిర్మాణానికి వెనకాడుతున్నట్లు లబ్ధిదార్లు చెబుతున్నారు. ఈ ప్రదేశం చాలా పల్లంగా ఉంటుందని, మెరక తోలుకోవాలంటే చాలా ఖర్చవుతుందని చెబుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఇస్తున్న రూ.1.8 లక్షలు ఇంటి నిర్మాణానికి ఏ మాత్రమూ సరిపోదని, రూ.5 లక్షల వరకూ ఖర్చవుతుందని అంటున్నారు.

రోజూ పని చేసుకుంటే గాని తమకు ఇల్లు గడవదని, పట్టణంలోనే తామకు పని దొరుగుతుందని లబ్ధిదార్లు అంటున్నారు. సరైన రవాణా

లే అవుట్‌లో అక్కడక్కడా దర్శనమిస్తున్న నిర్మాణాల.. వదిలేసిన నిర్మాణ సామగ్రి (ఇన్‌సెట్)

సదుపాయాల్లేని ఈ ప్రాంతానికి వస్తే తాము రోజూ 7 కిలోమీటర్ల దూరంలోని చిలకలూరిపేట పట్టణం కళామందిర్ సెంటర్‌కు వెళ్లాల్సి ఉంటుందని, ఇది తమకు తలకు మించిన పని అని అంటున్నారు. ఒకవేళ ధైర్యం చేసి ఎవరైనా ఇల్లు నిర్మించుకుందామనుకున్నా ఇక్కడ నీటి సదుపాయం లేదు. బోర్లు వేసినా ఉప్పు నీరు పడుతోంది. దీంతో నిర్మాణానికి అవసరమైన నీరు తెచ్చుకోవడం కష్టమవుతుందనే ఉద్దేశంతో చాలామంది వెనకడుగేస్తున్నారు. మరోవైపు ప్రభుత్వం, అధికారులు సైతం ఇళ్ల నిర్మాణాన్ని వేగవతం చేసేందుకు పెద్దగా ప్రయత్నించడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

ఇళ్ల స్థలాలు ఇచ్చి ప్రభుత్వం చేతులు దులిపేసుకుంటే సరికాదని, ఇంటి నిర్మాణమూ చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేస్తున్నారు. పెరిగిన నిర్మాణ సామగ్రి ధరల ప్రకారం ప్రభుత్వం ఇచ్చే మొత్తాన్ని పెంచాలని, దూరం ప్రాంతంలోని లే అవుట్‌కు మౌలిక సదుపాయాలు సమకూర్చి రవాణా సదుపాయమూ కల్పించాలని కోరుతున్నారు.

గుదేవారిపాలెం లే అవుట్‌కు నీటి సరఫరా లేదు. ఈ ప్రాంతానికి నీరు సరఫరా చేయాలంటే చిలకలూరిపేట పట్టణం నుండి కొత్తగా పైపులైన్ వేయాలి లేదా ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలి. ఇప్పుడు అలాంటి ఏర్పాటు ఏమీ లేదు. పసుమర్రు నుండి ఇవ్వడం మరోమార్గం. అయితే పసుమర్రులో 800 ఇళ్లు ఉండగా వారికే చెరువు నీరు చాలక ఏడాదిలో 3సార్లు ఆ చెరువును నింపడానికి తంటాలు పడాల్సి వస్తోంది. ఇవన్నీ కాకుండా లే అవుట్‌లోకి రానున్న ప్రజలతోపాటు పసుమర్రుకు మరోవైపున ఉన్న అన్నంభొట్లవారిపాలెం వైపు లే అవుట్ 6 వేల ప్లాట్ల ప్రజలకూ నీరు ప్రత్యేకంగా సరఫరా చేయాలంటే సుమారు 30 ఎకరాల్లో చెరువును ఏర్పాటు చేయాల్సి ఉంటుందని, ఆ ప్రయత్నాలేమీ ఇప్పటి వరకు లేవని 15వ వార్డు కౌన్సిలర్ జాలాది సుబ్బారావు అన్నారు. శ్మశాన స్థలమూ కేటాయించలేదని, రహదారి సదుపాయమూ సరిగా లేదని చెప్పారు.

అగ్నిప్రమాద బాధితులకు ఇళ్లపట్టాలు

ప్రజాశక్తి - అచ్చంపేట

అచ్చంపేట మండలం పెదపాలెం అగ్నిప్రమాద బాధితులకు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు వ్యక్తిగతంగా సాయం చేయడంతో పాటు ప్రభుత్వ సాయం కూడా గురువారం అందించారు. పలు స్వచ్ఛంద సంస్థల సహకారంతో బాధితులను మరింత సాయం అందేలా చూశారు. ప్రమాదంలో మరణించిన చిన్నారి పల్లవి కుటుంబసభ్యులను నంబూరు శంకర్రావు ఆయన భార్య వసంత కుమారి ఓదార్చారు. గతంలో వ్యక్తిగతంగా రూ.50 వేలు ఆర్థిక సాయం అందించిన ఎమ్మెల్యే ఇప్పుడు గహనిర్మాణ శాఖ, రెవెన్యూ శాఖ సహకారంతో ఇంటి స్థలం పట్టా అందజేశారు. నిర్మాణం కోసం ప్రభుత్వ సాయం అందించేలా ఏర్పాట్లు చేశారు. రూ.లక్షతో బియ్యం, నిత్యావసరాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. స్నేహహస్తం సొసైటీ ద్వారా బాధితులకు ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లో ఇళ్లు నిర్మించేందుకు ముందుకు వచ్చింది. అదే సమయంలో స్నేహహస్తం సొసైటీ ఆధ్వర్యంలో బాధితులకు దుస్తులు, దుప్పట్లను, నిత్యావసర సరుకులను ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, వసంతకుమారి దంపతులు అందజేశారు.

ఇళ్ల పట్టాలు అందిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు దంపతులు

పరీక్షల కోసం రెండు వరివిత్తన రకాలు

ప్రజాశక్తి - నకరికల్లు

లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దే వరి విత్తనాలు కొనుగోలు చేయాలని రైతులకు మండల వ్యవసాయాధికారి దేవదాస్ సూచించారు. మండల కేంద్రమైన నకరికల్లులోని మహితా ట్రేడర్స్‌నులో అధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. విత్తనాల నిల్వలు, స్టాక్ రిజిస్టర్, బిల్లు పుస్తకాలను పరిశీలించారు. విత్తనాల విక్రయ సందర్భంలో బిల్లుపై కొనుగోలుదారుని సంతకం, అమ్మిన వారి సంతకం, విత్తన రకం, లాట్ నంబర్ తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. లైసెన్స్ లేకుండా విత్తనాలను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇదిలా ఉండగా బిపిటి 5204, హెఎంటి రకం వరి విత్తనాలు నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉన్నాయో లేదో పరిశీలనకు నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌నకు పంపించినట్లు ఏవో తెలిపారు.

రికార్డులను పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి

చల్లబర్చిన చిరు వర్షం

ప్రజాశక్తి - మాచర్ల

అత్యధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోతలతో రెండు నెలలుగా అల్లాడిన మాచర్ల పరిసర ప్రాంతాల ప్రజలకు గురువారం కురిసిన వర్షం ఊరట కలిగించింది. రెండ్రోజులుగా ఆకాశం మేఘావృతం అవుతున్నా వర్షం పడలేదు. గురువారం సాయంత్రం చిరు జల్లులు పడటంతో వాతావరణం పూర్తిగా చల్లబడింది. అయితే పదునైన వర్షం పడితే తాము వ్యవసాయానికి ఉపక్రమించొచ్చని రైతులు నిరీక్షిస్తున్నారు. బోర్ల కింద సాగు చేసే వారు మినహా మిగిలిన రైతులంతా మొక్క నాటేందుకు వర్షం కోసం ఎదురు చూస్తున్నారు.

రాజకీయ కారణాలతో నేతన్ననేస్తానికి అనర్హత

ప్రజాశక్తి-ఈపూరు

టిడిపి మద్దతుదారులనే కారణంతో మండలంలోని ఆరేపల్లి ముప్పాళ్లకు చెందిన ఆరుగురి పేర్లను నేతన్ననేస్తం పథకం అర్హుల జాబితా నుండి తొలగించారని పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేశారు. తమ పేర్లను ఉద్దేశపూర్వకంగానే తొలగించారని, దీనిపై జిల్లా కేంద్రంలో నిర్వహించిన కలెక్టర్ స్పందనలో ఫిర్యాదు చేసినా ఫలితం లేదని చెప్పారు. రాజకీయ కక్షలు మానుకుని అర్హులందరికీ పథకాలను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఆర్.జగ్గారావు, ఇ.హనుమయ్య, కె.చంద్రరావు, డి.కోటేశ్వరరావు, సైదారావు, పాపారావు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న బాధితులు, నాయకులు

బాధితుల అభిప్రాయాలు..

ఉన్న ఇంటికే పట్టాలనుకున్నాం

మహ్మద్ హసీనా

ఉన్న ఇంటికే పట్టాలిస్తారని అనుకున్నాం. వేరే చోట స్థలాల కేటాయించి పట్టాలిస్తారని మేమనుకోలేదు. రాజధానిలో ఇచ్చిన పట్టాలు మాకు అక్కర్లేదు. ఇక్కడ ఉన్న స్థలాలకు పట్టాలివ్వాలి.

అడవిలో పడేస్తే ఎలా

ఎస్‌కె ఖాదర్‌బి

మమ్మల్ని తీసుకెళ్లి మారుమూల అడవిలో పడేస్తే ఎలా. మౌలిక సదుపాయాలు లేని ప్రాంతంలో ఎలా ఉండగలుగుతాం. అక్కడ నుంచి బయటకు వెళ్లాలంటే ఇబ్బంది. మాకు కేటాయించిన ప్లాట్ల సమీపంలో పెద్దఎత్తున ముళ్లపొదలు ఉన్నాయి.

హామీని నిలబెట్టుకోవాలి

నాగవేణి

గత ఎన్నికల ముందు ఎమ్మెల్యే చెప్పిన మాట నిలబెట్టుకోవాలి. తాను గెలిస్తే ఇక్కడే పట్టాలిస్తామని హామీనిచ్చారు. ఇచ్చిన హామీ ప్రకారం ఇక్కడే ఉండే విధంగా తగిన చర్యలు తీసుకోవాలి. మాట నిలబెట్టుకోవాలి.

కనీస వసతులు లేవు

రాజేంద్రప్రసాద్

ప్రభుత్వం కేటాయించిన స్థలాల సమీపంలో ఆసుపత్రిగానీ, పాఠశాలగానీ ఏమీ లేవు. అటువంటి చోటకు వెళ్లి ఉండలేం. ఇప్పుడుం టున్న స్థలాల్లోనే మరిన్ని మౌలిక సౌకర్యాలు కల్పిస్తే ఇక్కడే ఉంటాం. ఇప్పుడుంటున్న స్థలాలకే పట్టాలిచ్చి ఆదుకోవాలి.

కాలనీ వాసులు

చావైనా బతుకైనా ఇక్కడే...

అధికారులకు తేల్చిచెప్పిన నులకపేట అటవీ ప్రాంత పేదలు

పేదల ఆందోళనకు సిపిఎం మద్దతు - నివాస స్థలాలకే పట్టాలివ్వాలని డిమాండ్

ప్రజాశక్తి-తాడేపల్లి

చావైనా రేవైనా ఇక్కడే ఉంటాం... ప్రస్తుతం మేము నివాసముంటున్న ఇళ్లకే పట్టాలివ్వాలి. ఎక్కడికో అడవిలోకి తీసుకెళ్లి పడేస్తే మేమెట్లా బతకాలి. స్థానికంగా విజయవాడ, మంగళగిరి ప్రాంతాలకు దగ్గరలో ఉన్న మాకు ఉన్న గడ్డ మీదే నివాసముంటాం. ఇక్కడ నుంచి కదలబోమంటూ గురువారం సిపిఎం నాయకుల ముందు తాడేపల్లి పట్టణంలోని నులకపేట ఫారెస్టు ప్రాంత వాసులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. గత శాసనసభ ఎన్నికలకు ముందు ఎక్కడ ఉన్న వారికి అక్కడే స్థలాలను రెగ్యులరైజేషన్ చేసి పట్టాలిస్తామని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి మాటిచ్చిన సంగతిని గుర్తు చేశారు. లోకేష్ వస్తే అందరి ఇళ్లు తొలగిస్తారని తానుంటే ఇళ్లకు, మీకు రక్షణ కల్పిస్తానని హామీనిచ్చిన మాటలను గుర్తు చేసుకుంటున్నారు. రాజధానిలో ప్లాట్లు అంటూ సెంటు స్థలం ఇచ్చి అక్కడకు వెళ్లమంటే మా ఉపాధి సంగతి ఏంటని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన ప్లాట్ల దగ్గర నుంచి పనులు వెతుక్కోవడానికి వెళ్లాలంటే 20 కిలోమీటర్ల దూరంతో పాటు రవాణా ఛార్జీలు తడిసి మోపెడవుతాయని, రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని, పిల్లల చదువులకు ఆటంకం ఏర్పడుతుందని వాపోయారు. ప్రస్తుతం ఉన్న ప్రాంతంలో కొద్దో గొప్పో వెచ్చించి తమ శక్తి మేరకు పూరిపాక, రేకులు వేసుకుని ఉంటున్నామని చెప్పారు. మళ్లీ అక్కడకు వెళ్లి సొంత నిర్మాణాలు చేపట్టాలంటే తమకు అంత ఆర్థిక పరిస్థితి లేదని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.1.20 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.60 వేలు ప్రభుత్వం కేటాయించిన ప్లాట్లలో మెరకలకు కూడా సరిపోవని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అనేక ఇబ్బందులు, పోలీసు అరెస్టులు పోరాటాల వల్ల 13 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసుకున్న తమ ఇళ్లు ఇక్కడే ఉండే విధంగా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు. తాను గెలిస్తే ఎక్కడ ఉన్న వారికి అక్కడ స్థలాలను రెగ్యులరైజేషన్ చేయడంతో పాటు పట్టాలు ఇస్తామని ఎమ్మెల్యే చెప్పిన మాట నిలబెట్టుకోవాలని కోరారు. ప్రభుత్వం కేటాయించిన ప్లాట్లలో ఎటువంటి వైద్య సౌకర్యాలు, పిల్లలకు విద్య వసతి లేవని చెప్పారు. ప్రభుత్వం పట్టాలు ఇస్తాం రమ్మంటే ప్రస్తుతం ఉన్న ఇళ్లకే పట్టాలిస్తామనుకున్నామని, కొత్త స్థలాలు కేటాయించి పట్టాలిస్తారని అనుకోలేదని చెప్పారు. తమకు ఇళ్ల వెంట వచ్చి చెప్పిన వారు కూడా మీ స్థలాలకు పట్టాలిస్తాం రమ్మంటే వెళ్లామని, వేరే స్థలాల్లో ఇస్తామని మాకుచెప్పాలేదని చెప్పారు. ప్రస్తుతం ఉంటున్న స్థలాల్లో లక్షలాది రూపాయలతో అభివృద్ధి పనులు చేసుకున్నామని తెలిపారు. ప్రస్తుతం పైపులైన్ పనులు కూడా జరుగుతున్నాయని చెప్పారు. గతంలో జెసి లాంటి అధికారులు ఇక్కడే పట్టాలిచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారని తెలిపారు. 13 ఏళ్ల నుంచి ఈ గడ్డ మీద బతకడానికి అలవాటు పడ్డ తాము ఎక్కడికీ కదిలేది లేదని కరాఖండిగా చెబుతున్నారు.

ఇక్కడే సౌకర్యంగా ఉంది

కడప శ్యామల

ప్రస్తుతం ఉంటున్న చోటే సౌకర్యంగా ఉంది. అటు విజయవాడ ఇటు మంగళగిరి వివిధ రకాల పనులకు వెల్లాలన్నా అందుబాటులో రవాణా సౌకర్యం ఉంది. దూరంగా ఇళ్లస్థలాలు ఇస్తే ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉంది.

తాడోపేడో తేల్చుకుంటాం

కంచర్ల రాజ్యం

13 సంవత్సరాల నుంచి ఉంటున్నాం. అనేక ఆందోళనల వల్ల రోడ్లు, కరెంటు సౌకర్యాలు ఏర్పాటు చేసుకున్నాం. మంచినీళ్లు ఇళ్ల ముందుకు వచ్చాయి. వేరే చోటకు వెళ్లాలంటే వెళ్లలేం. అదనపు ఛార్జీలు అవుతాయి. ఇక్కడే ఉండే విధంగా తగిన చర్యలు తీసుకోవాలి.

ఎక్కడికీ వెళ్లం

ఎం.అభిశేఖర్

గత 13 ఏళ్ల నుంచి ఇక్కడే ఉంటున్నాం. జీవనానికి అలవాటు పడ్డాం. ఇక్కడే ఉంటాం. ఇక్కడే తనువు చాలిస్తాం. మరోచోటకు వెళ్లి ఉండాలంటే ఉండలేం.

ఉన్న ఇళ్లకే పట్టాలివ్వండి : సిపిఎం

ఈ సందర్భంగా పేదలను ఉద్దేశించి సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, నాయకులు వేముల దుర్గారావు మాట్లాడుతూ గత 13 ఏళ్ల నుంచి నవాసముంటుంన్న పేదలను వేరే చోటకు తరలించడం సరికాదన్నారు. ప్రస్తుతం ఉంటున్న వారి స్థలాలను రెగ్యులరైజేషన్ చేసి పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. లక్షలాది రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఇక్కడ ఉంటున్న వేరే చోటకు తరలిస్తే కోట్లాది రూపాయల ప్రజాధనం వృధా తప్ప ప్రయోజనం లేదన్నారు. గతంలో స్థానిక ఎమ్మెల్యే, అధికారులు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని, పట్టాలిస్తామని జెసి గతంలో ప్రకటించారని గుర్తు చేశారు. తాడేపల్లి ఫారెస్టు ప్రాంతంలో నివాసముంటున్న పేదలకు ఎక్కడ ఉన్న వారికి అక్కడే పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 26వ తేదీ సచివాలయాల ముందు ధర్నా నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు.

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

30న విజయవాడలో మహాధర్నా

జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జొన్నా శివశంకర్ పిలుపు

ప్రజాశక్తి-తెనాలి: రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 30న విజయవాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని ఏపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జొన్నా శివశంకరరావు పిలుపునిచ్చారు. స్థానిక చెంచుపేట ప్రజాసంఘాల కార్యాలయంలో గురువారం ముద్దన సాంబశివరావు అధ్యక్షతన విస్తృత సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది ఖరీఫ్, రబీ సీజన్లలో నష్టపోయిన రైతాంగానికి ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇన్‌పుట్ సబ్సిడీ ఆహార పంటలకు ఎకరానికి రూ.10వేలు, వాణిజ్య పంటలకు ఎకరానికి రూ.25వేల చొప్పున పెంచాలన్నారు. కేంద్రప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర, పెరిగిన వ్యవసాయ ఖర్చులతో పోల్చుకుంటే ఇది ఏమాత్రం చాలదన్నారు. కేరళ ప్రభుత్వ తరహాల్లో 20శాతం బోనస్ చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ చినరావూరు-జంపని మధ్య రేపల్లె రైలు మార్గంలో మూసివేసిన లెవెల్ క్రాసింగ్‌ను తెరిపించాలని, ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఇబ్బంది లేకుండా పంట కాల్వలు, మురుగు కాల్వల్లో పూడికతీతకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. రైతాంగం ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై జరిగే మహాధర్నాలో రైతులు పాల్గొనాలన్నారు. సమావేశంలో కంచర్ల తారకేశ్వరరావు, అడపాల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జొన్నా శివశంకరరావు

మేడికొండూరు తహశీల్దార్‌గా శ్రీనివాసశర్మ

ప్రజాశక్తి- మేడికొండూరు

మేడికొండూరు మండలం తహశీల్దార్‌గా కె శ్రీనివాస శర్మ గురువారం బాధ్యతలు స్వీకరించారు. పల్నాడు జిల్లా గురజాల తహశీల్దార్‌గా ఉన్న శ్రీనివాస శర్మ బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఉన్న తహశీల్దార్ జి కరుణకుమార్ పల్నాడు కలెక్టరేట్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస శర్మ మీడియాతో మాట్లాడారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ రెవెన్యూ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారం చేస్తామని తెలిపారు.

నిరసన తెలుపుతున్న కార్మికులు

26 తరువాత సమ్మెలోకి

నికో ఆగ్రో అయిల్ కంపెనీ ఎదుట రెండవ రోజూ నిరసన

ప్రజాశక్తి - మేడికొండూరు

మండలంలోని పారిశ్రామిక ప్రాంతమైన పేరేచర్ల నికో ఆగ్రో ఆయిల్ కంపెనీ వర్కర్స్ సమస్యలు పరిష్కరించకుంటే ఈనెల 26వ తేదీ తర్వాత సమ్మెలోకి వెళ్తామని యూనియన్ సిఐటియు మండల కార్యదర్శి ఎస్ ఎం భాషా స్పష్టం చేశారు. గురువారం ఉదయం 6 గంటలకు కంపెనీ వద్ద సమ్మె డిమాండ్లు పరిష్కారం చేయాలని కోరుతూ చేపట్టిన దీక్ష గురువారం రెండవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాజమాన్యం మొండి వైఖరి వీడి కార్మికులతో చర్చలు జరపాలన్నారు. కొద్దిమంది కార్మికులను తొలగించేందుకు ఇచ్చిన నోటీసులను బేషరతుగా వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇంక్రిమెంట్ లు పెంచాలని ,కనీస సౌకర్యాలైన మంచినీరు మరుగుదొడ్లు క్యాంటీన్ వంటి సౌకర్యాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పారిశ్రామిక శాంతియుత వాతావరణం నెలకొనేందుకు యూనియన్ ఎల్లవేళలా సహకరిస్తుంది అన్నారు. తక్షణమే యాజమాన్యం స్పందించి చర్చల జరపాలని లేని పక్షంలో 26వ తారీకు తర్వాత ఏ క్షణమైనా సమ్మెలోకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్.శ్రీకాంత్, షేక్ మీరా సాహెబ్, కె.శ్రీనివాసరెడ్డి,పామూరి సుధాకర్ రెడ్డి,కె.సాంబ శివరావు, రాంబాబు, శ్రీనివాసరావు, షేక్.ఇమాంషా, ఆర్.రాజేష్, చిటికాల వెంకటేశ్వర్లు, యస్.సంగీతరావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎం.రవి, ఎం.భాగ్యరాజు

పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - తుళ్లూరు : అసెంబ్లీ, సచివాలయ పారిశుధ్య కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్ష, కార్యదర్శి ఎం రవి, ఎం భాగ్యరాజు డిమాండ్ చేశారు. పెండింగ్ పీఎఫ్, ఈఎస్ఐ కార్డులు ఇవ్వకుండా తాత్సారం చేయడం తగదన్నారు. గురువారం అసెంబ్లీ, సచివాలయం కార్మికుల విస్తృత సమావేశం లో వారు మాట్లాడుతూ కార్మికులకు కాంట్రాక్ట్ సంస్థ ఐదు నెలల పిఎఫ్ పెండింగ్ లో ఉంచిందని, ఈఎస్ఐ కార్డులు పనిచేయక కార్మికులు వైద్యం కోసం వేల రూపాయలు ఖర్చుపెట్టి ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారని చెప్పారు. కాంట్రాక్ట్ సంస్థ నిర్వాహకులు మాత్రం పిఎఫ్, ఈఎస్ఐ పేరుతో జీతంలో మినహా యిసున్నారని, ఎన్నిసార్లు అడిగినప్పటికీ ఇదిగో ఇస్తున్నామని చెప్తున్నారే తప్ప ఈఎస్ఐ కార్డులు ఇవ్వడం లేదని, పీఎఫ్ సక్రమంగా కట్టడం లేదని మండిపడ్డారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

సత్కారం పొందుతున్న మంత్రి అంబటి రాంబాబు

కుల ధ్రువీకరణ పత్రాల జారీపై మంత్రి ఆదేశం

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

మాదిగ దాసు (ఎస్సీ-బి) సామాజిక ధ్రువీకరణ పత్రాల మంజూరులో జాప్యం వద్దని తహశీల్దార్ సురేష్‌కు రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు సూచించారు. పట్టణంలోని 11వ వార్డులో వంకాయలపాటి శ్రీహరి నివాసంలో మాదిగ దాసులతో మంత్రి గురువారం సమావేశమయ్యారు. తమకు కుల ధ్రువీకరణ పత్రాలు తహశీల్దార్ జారీకీ ప్రభుత్వం జీవోనిచ్చినా అది అమలు కావడం లేదని, ఆర్‌డిఒ ద్వారా తీసుకోవాలంటున్నారని మంత్రికి సంఘ నాయకులు చెప్పారు. దీనిపై మంత్రి స్పందిస్తూ తహశీల్దార్‌ను పిలిపించారు. జీవో ప్రకారం ధ్రువపత్రాలు ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం మంత్రిని సంఘ పెద్దలు సత్కరించారు. కార్యక్రమంలో యార్డు చైర్మన్ పి.బాబురావు, పి.సూరిబాబు, మాజీ చైర్మన్ ఆర్.పురుషోత్తం, ఎ.శివప్రసాద్, విశ్రాంత తహశీల్దార్ ఎ.కోటేశ్వరమ్మ, పీరుదాస్, శశిదేవి, రమణ, మల్లిఖార్జునరావు, ఎ.నాగరాజు పాల్గొన్నారు.

కరపత్రాలను అందిస్తున్న కన్నా లక్ష్మీనారాయణ

వార్డుల్లో కన్నా లక్ష్మీనారాయణ ప్రచారం

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

'భవిషత్‌కు గ్యారెంటీ'లో భాగంగా పట్టణంలోని 4, 7 వార్డుల్లో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కన్నా లక్ష్మీనారాయణ గురువారం ప్రచారం చేశారు. ప్రజల బంగారు భవిష్యత్ రావాలంటే టిడిపిని గెలిపించాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందించారు. ఆయన వెంట నాయకులు వై.రామస్వామి, సిహెచ్.శ్రీనివాసరావు, కె.రామకృష్ణ, ఎ.నాగేశ్వరావు, బాబు, నరేష్, సుధాకర్, జి.శ్రీనివాసరావు, రమేష్ ఉన్నారు.

శ్రీశ్రీ మహాప్రస్థానం- ఆధునిక సమాజంపై ప్రభావంపై రేపు సాహిత్య చర్చ : కలెక్టర్

ప్రజాశక్తి - నరసరావుపేట

నెలనెలా.. సాహిత్య మేళా.. పట్టణంలోని భువనచంద్ర టౌన్‌హాలులో శనివారం నిర్వహిస్తామని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో 'శ్రీశ్రీ మహాప్రస్థానం - ఆధునిక సమాజంపై ప్రభావం' అనే అంశంపై సాహిత్య చర్చ ఉంటుందని తెలిపారు. చర్చలో ప్రధాన వక్తగా అభ్యుదయ రచయితల సంఘం మాజీ జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ, విశిష్ట అతిధులుగా రాష్ట్ర జలవనుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ హాజరవుతారని కలెక్టర్ పేర్కొన్నారు.

ఆక్రమించ'బడి'న స్థలం

గుట్టుగా రిజిస్ట్రేషన్ చేయించుకుని భవన నిర్మాణం

ప్రజాశక్తి - బెల్లంకొండ

పాఠశాల కోసం ఇచ్చిన స్థలాన్ని రాజకీయ అండతో అక్రమార్కులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. పైగా ఆ స్థలంలోనే నిర్మాణాన్నీ మొదలు పెట్టడంతో అసలు విషయం తెలిసిన స్థానికులు ఇదేమి దారుణమని ఆవేదనకు గురవుతున్నారు. మండల కేంద్రమైన బెల్లంకొండ పంచాయతీ పరిధిలోని కొత్తపాలెం ఎస్సీ కాలనీలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉంది. 30-40 ఏళ్ల కిందట ఈ ప్రాంతానికి పాఠశాల లేకపోవడంతో స్థానికులు అర్జీలు పెట్టుకోగా అప్పట్లో ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే పాఠశాల భవన నిర్మాణానికి స్థలం లేకపోవడంతో పాఠశాల ఏర్పాటే సంశయంలో పడింది. దీంతో తమ ప్రాంతానికి పాఠశాల రాకుండా పోతుందేమోనని భావించిన స్థానికులు తమ అధీనంలో 10 సెంట్ల గ్రామకంఠాన్ని పాఠశాలకు అందించారు. ఇందులో కొంత స్థలంలో పాఠశాలను నిర్మించగా మిగిలిన స్థలంలో పిల్లలు ఆటలాడుకుంటూ ఉండేవారు. అయితే కొద్దిరోజుల కిందట పాఠశాల ఖాళీ స్థలంలో అధికార పార్టీకి చెందిన కొందరు ఆ స్థలంలో నిర్మాణాలు చేపట్టారు. ఇదేమిటని ఆరా తీస్తే ఆ స్థలాన్ని వారు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిసి స్థానికులు ఆశ్చర్యపోతున్నారు. ఆక్రమణలను నిరోధించాలని పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని అంటున్నారు. దీనిపై విఆర్‌ఒ, పంచాయతీ కార్యదర్శి, ఎంఇఒను సంప్రదించేందుకు ప్రయత్నించినా వారు అందుబాటులోకి రాలేదు.

ప్రభుత్వ పాఠశాల స్థలంలో నిర్మితమవుతున్న భవనం

నవోదయ విద్యాలయానికి ఎంపికైన విద్యార్థులు

ప్రజాశక్తి - నరసరావుపేట

మండల కేంద్రమైన రొంపిచర్లని గోగులపాడు రోడ్డులో గల కేరళ మోడల్ స్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు నవోదయ విద్యా సంస్థకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ గెల్లి గాలిరెడ్డి గురువారం తెలిపారు. 6వ తరగతిలో ప్రవేశం కోసం ఇటీవల జరిగిన నవోదయ పరీక్షలో తమ పాఠశాలకు చెందిన పోలిశెట్టి త్రినాథ్, నారే కీర్తి, అంగలూరి శ్రీభవ్య, తోడేటి అభిషేక్ ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఎంపికైన వారితోపాటు తమ పాఠశాల విద్యార్థులు ప్రతి సంవత్సరం నవోదయ పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ చూపడానికి కృషి చేస్తున్న ఉపాధ్యాయులును అభినందించారు.

మాదాసు మహిధర్ ఆడవతు బాలాజీ నాయక్

ప్రజాశక్తి - రాజుపాలెం

జవహర్ నవోదయ ఆరవ తరగతి ప్రవేశానికి మండల కేంద్రమైన రాజుపాలెంలోని నవోదయ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు ఇద్దరు ఎంపికయ్యారు. క్రోసూరు మండలం నాగవరానికి చెందిన మాదాసు మహిధర్, బెల్లంకొండ మండలం మాచాయపాలెం ఆర్‌ఆర్ కేంద్రానికి చెందిన ఆడవతు బాలాజీ నాయక్ ఎంపికయ్యారు. వీరిని ప్రిన్సిపాల్ పి.రామారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రచారంలో డిబిఆర్‌సి ప్రతినిధులు, కౌలురైతులు

కౌలురైతులంతా గుర్తింపు కార్డులు పొందాలి

ప్రజాశక్తి - నరసరావుపేట

దళిత బహుజన రిసోర్స్ సెంటర్ (డిబిఆర్‌సి) ఆధ్వర్యంలో కౌలు రైతుల ప్రచార ఉద్యమం జొన్నలగడ్డ, ములకలూరు గ్రామాల్లో గురువారం నిర్వహించినట్లు డిబిఆర్‌సి నరసరావుపేట ఏరియా కో-ఆర్డినేటర్ వేణు అన్నారు. ఈ మేరకు గురువారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న డిబిఆర్‌సి గుంటూరు, పల్నాడు జిల్లాల రీజినల్ కో-ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కౌలు రైతులు సిసిఆర్‌సి కార్డులు పొందటం ద్వారా ఇన్పుట్ సబ్సిడీ విత్తనాలు, ఎరువులు లభిస్తాయని, బ్యాంకు రుణాలూ మంజూరవడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. గుర్తింపు కార్డులు పొందిన వారికి రైతుభరోసా కూడా వర్తిస్తుందన్నారు. అయితే వీటివల్ల భూయజమానుల హక్కులకు నష్టమేమీ ఉండదని అన్నారు. కౌలు రైతులు సాగు చేసిన పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని చెప్పారు. ఈ మేరకు రైతులు, కౌలురైతులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ రామసీత, మహిళా పోలీస్ శాంభవి, ఎంఎల్‌ఒ వెంకటేశ్వర్లు, జొన్నలగడ్డ సర్పంచ్ కె.చిన్న పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని కన్నెగండ్లకు చెందిన టిడిపి సీనియర్ కార్యకర్త కోరంపల్లి బ్రహ్మయ్య (70) గురువారం మరణించారు. భౌతికకాయాన్ని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రమేష్ సందర్శించి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ సహకారంతో రూ.5 వేల సాయాన్ని మృతుని కుటుంబానికి అందించారు. టిడిపి కార్యకర్తల కుటుంబానికి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని రమేష్ అన్నారు. నివాళులర్పించిన వారిలో సర్పంచ్ కె.వెంకటరామయ్య, ఉపసర్పంచ్ కె.ఆంజనేయులు, వి.వీరయ్య, కె.నరేంద్ర, కె.వెంకట్రావు పాల్గొన్నారు.

మృతుని కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న నాయకులు

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన

ప్రజాశక్తి - నరసరావుపేట

స్థానిక టిట్కో ఇళ్ల వద్ద రూ.4 కోట్లతో ఏర్పాటు చేయనున్న విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పల్నాడు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్‌బాబు గురువారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కొద్ది రోజుల్లో టిడ్కో గృహ సముదాయాలకు రహదార్ల నిర్మాణం, నాణ్యమైన విద్యుత్, తాగునీరు వంటి సదుపాయాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు విద్యుత్ శాఖాధికారులు పాల్గొన్నారు.

భవిష్యత్ కార్యాచరణపై రోటరి సమీక్ష

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్ల రోటరి క్లబ్ ఆధ్వర్యంలో ఆంధ్ర రీజియన్‌లోని 9 క్లబ్‌ల సభ్యులతో సమీక్షా సమావేశం స్థానిక క్లబ్ అధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి అధ్యక్షతన గురువారం జరిగింది. సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రోటరి గవర్నర్ తాళ్ళ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రోటరి సేవలను అన్ని రంగాల్లో మరింతగా విస్తరించేందుకు స్పష్టమైన ప్రణాళికను తయారు చేసుకోవాలని ప్రతినిధులకు సూచించారు. ఉపాధి చూపించే కార్యక్రమాలు నిర్వహిస్తే ఎంతో మందికి జీవనోపాధి చూపిన వారు అవుతారని అన్నారు. పలు అంశాలపై శిక్షణ, అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తదుపరి గవర్నర్ బూసిరెడ్డి శంకర్‌రెడ్డి, రీజియన్ ట్రైనర్ మామిడి సుబ్బారావు, మాజీ గవర్నర్ శివన్నారాయణ, అసిస్టెంట్ గవర్నర్లు శంకర్, ఎ.శ్రీనివాసరావు, బి.శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ కె.రామకోటయ్య, టి.శ్రీనివాసరావు, కె.నాగేశ్వరరావు, డాక్టర్ ఎస్.మురహరిరావు పాల్గొన్నారు.

27న రైతుకూలి సంఘం రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి - రెంటచింతల : మండల కేంద్రమైన రెంటచింతలలో ఈనెల 27న రైతు కూలి సంఘం (ఏపీ) రాష్ట్ర మహాసభ నిర్వహించనున్నట్లు రాష్ట్ర నాయకులు ఉల్లిగడ్డల నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు వాల్‌పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో జె.పద్మ, సత్తయ్య పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని పెంపొందించడమే లక్ష్యం

తాడేపల్లిలో అట్టహాసంగా 'మంగళగిరి వాలీబాల్ లీగ్-2' పోటీలు

ప్రారంభించిన టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, నక్కా ఆనందబాబు

ప్రజాశక్తి - తాడేపల్లి

నియోజకవర్గ యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలతో పలు క్రీడాపోటీలను నిర్వహిస్తున్నారని టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, నక్కా ఆనందబాబులు అన్నారు. నారా లోకేష్ సారథ్యంలో మంగళగిరి వాలీబాల్ లీగ్-2 పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. తాడేపల్లి బైపాస్ రోడ్డు వెంబడి ఏర్పాటు చేసిన నారా లోకేష్ క్రీడా ప్రాంగణంలో ఈ పోటీలను వర్ల రామయ్య, నక్కా ఆనందబాబులు స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. సరదాగా వాలీబాల్ ఆడుతూ క్రీడాకారులను ఉత్సాహపరిచారు. వాలీ బాల్ టోర్నమెంట్ పోటీలలో పాల్గొంటున్న క్రీడాకారులందరూ క్రీడా స్ఫూర్తిని కలిగి అద్భుతమైన ప్రతిభను ప్రదర్శించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పోలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య మాట్లాడుతూ యువత క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. క్రమం తప్పకుండా క్రీడలను ప్రతి రోజూ సాధన చేస్తూ వుంటే ఆకర్షణీయమైన శరీర సౌష్టవంతో పాటు, చక్కటి ఆరోగ్యాన్ని సాధించగలరని సూచించారు. స్థానిక ఎమ్మెల్యే ఆర్కే నియోజకవర్గ అభివృద్ధిని గాలికి వదిలేసారని ఆరోపించారు. నియోజకవర్గాన్ని అభివద్ధి చేయాలన్న దృఢ సంకల్పంతోనే నారా లోకేష్ పని చేస్తున్నట్లు తెలిపారు. పోలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. నారా లోకేష్ 134 రోజులుగా అలుపెరగాని పోరాటం చేస్తున్నట్లు చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో యువత గంజాయికి అలవాటు పడి తమ బంగారు భవితను చేజేతులా నాశనం చేసుకుంటున్నారని వ్యాఖ్యానించారు. నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య మాట్లాడుతూ 32జట్లు, 192 మంది క్రీడాకారులు నారా లోకేశ్ క్రీడాప్రాంగణంలో అంతర్జాతీయ ప్రమాణాలతో, ఫ్లడ్ లైట్ల వెలుతురులో నిర్వహించే పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతి ఇట్టా పెంచలయ్య రూ.50 వేలు, ద్వితీయ బహుమతి చిన్నబోతుల సుబ్బారావు రూ. 30 వేలు, తృతీయ బహుమతి ఇట్టా భాస్కర్ రూ 20 వేలు, వాలీబాల్ కిట్స్‌ను కొమ్మారెడ్డి కిరణ్ అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు,ఈ మంగళగిరి వాలీబాల్ లీగ్-2 ప్రారంభోత్సవ కార్యక్రమంలో తాడేపల్లి టౌన్, మండల పార్టీ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, అమరా సుబ్బారావు, నాయకులు తోట పార్థసారధి, కేశంనేని శ్రీ అనిత తదితరులు పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న నక్కా ఆనందబాబు

పోటీలలో పాల్గొన్న క్రీడాకారులు

భవన నిర్మాణ కార్మికుడు మృతి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

స్థానిక కాకాని రోడ్డు వాసవి నగర్ లో గురువారం నిర్మాణంలోఉన్న ఇంటిలో ఐదో అంతస్తునుంచి భవన నిర్మాణ కార్మికుడు ప్రమాదవశాత్తు పడి మృతి చెందిన ఘటన తెలిసింది. నల్లపాడుకు చెందిన మెరుగుమాల ఆదం (40) రాడ్ బెండింగ్ పనిచేస్తూ ప్రమాదవశాత్తు జారీ పడ్డాడని పోలీసులు తెలిపారు. పాత గుంటూరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రూ.6 లక్షల ఆభరణాలు చోరీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

స్థానిక ఆనంద్ పేట 9 వ లైన్ లో బుధవారం అర్ధరాత్రి దొంగతనం జరిగింది. రూ.6 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, నగదు అపహరణకు గురైనట్లు అబ్దుల్ షబీర్ అహమ్మద్ పాత గుంటూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంట్లోని బీరువా తాళాలు తొలగించి చోరీకి పాల్పడినట్టు ఫిర్యాదులో తెలిపారు. 10 కాసుల బంగారం, ఇతర వస్తువులు అపహరణకు గురైనట్టు పోలీసులు తెలిపారు. కేసును పాతగుంటూరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు

ఆరు కిలోల గంజాయి స్వాధీనం

ఇద్దరు నిందితుల అరెస్టు - వివరాలు వెల్లడించిన ఎఎస్‌పి మహేష్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో 6 కిలోల గంజాయిని గురువారం స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎఎస్‌పి డి.ఎన్.మహేష్ స్థానిక ఇన్నర్ రింగ్ రోడ్డులోని ఎక్సైజ్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ స్థానిక వెంగళాయ పాలెం కు చెందిన మౌలాలి పాడేరు జిల్లా లంబసింగి ప్రాంతం నుండి వివిధ వాహనాల ద్వారా గంజాయి తీసుకు వచ్చి గత కొంత కాలంగా గంజాయి విక్రయిస్తున్నాడు. మౌలాలి వద్ద నుంచి గంజాయిని పేరేచర్ల నివాసి కుర్రా సాయికుమార్ కొనుగోలు చేస్తున్నారు. మౌలాలి, సాయికుమార్‌ను అరెస్టు చేసి ఆరుకిలోల గంజాయిని, ద్విచక్ర వాహనాన్నిస్వాధీనం చేసుకున్నామని తెలిపారు. గుంటూరు లో నలుగురు గంజాయి విక్రేతలు పై పీడీ యాక్ట్ పెట్టామని ఆయన అన్నారు.ప్రధానంగా విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని గంజాయి విక్రయిస్తారని,యువత గంజాయి కి బానిసలై జీవితాలు నాశనం చేసుకుంటున్నారని అన్నారు. గంజాయి విషయంలో ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు కళాశాలల వద్ద అవగాహన సదస్సునిర్వహిస్తున్నట్టు తెలిపారు.

సిసి రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్ తదితరులు

వేగవంతంగా సిసి రోడ్ల నిర్మాణం

ప్రజాశక్తి - దుగ్గిరాల : మండల కేంద్రంలో అభివృద్ధి పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నారు. సర్పంచ్ మేఘావత్ ఖుషిబాయ్ ఆధ్వర్యంలో అలీనగర్‌లో నాలుగు సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. ఇప్పటికే ఒక రోడ్డు పని ప్రారంభించారు. ఫ్లవర్ బ్రిక్స్‌తో రోడ్డు నిర్మాణం, స్థానిక బాలికల హైస్కూల్ వద్ద ఫుట్ బ్రిడ్జి నిర్మాణాలను గురువారం సర్పంచ్ అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు మేఘవత్ వెంకటేశ్వర నాయక్, షేక్ బాజీ పంచాయతీ సభ్యులు షేక్ నాగూర్, తుమ్మపూడి గోవిందమ్మ పాల్గొన్నారు.

ఇంటర్ పుస్తకాలు ఉచితంగా ఇవ్వాలి

ప్రజాశక్తి-గుంటూరు :ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఇంటర్ బోర్డు ఉచితంగా పాఠ్యపుస్తకాలను ఇవ్వాలని పిడియస్‌యు రాష్ట్ర అధ్యక్షులు యు.గనిరాజు ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే పేద, మధ్యతరగతి విద్యార్థుల పట్ల బాధ్యత వహించి, పాఠ్యపుస్తకాలను ఉచితంగా ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రచార ఆర్భాటంలో ఉనంత శ్రద్ధ, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఉచితంగా అందించాలనే దానిపై లేదని ఆన్నారు. 2023-24 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు ఇవ్వట్లేదని, మార్కెట్‌లో ఇంటర్మీడియట్ పాఠ్యపుస్తకాలను తెలుగు, సంస్కృత అకాడమీ ముద్రించిం దని, ఇవి మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయని ఉన్న వాటిని కొనుగోలు చేసుకోవాలని ఇంటర్ విద్యాశాఖ ఆదేశాలు జారీ చేయడం సమంజసం కాదన్నారు. మార్కెట్‌లో ఇంగ్లీష్ మీడియం తెలుగు మీడియం అకాడమీ పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలతో కలిపి కొనాలంటే ప్రతి పేద మధ్యతరగతి విద్యార్థుల తల్లిదండ్రులపై రూ.3వేల నుండి రూ. 5వేలు భారం పడుతుందన్నారు. ఇంటర్ విద్యామండలికి సంభందించిన రూ.200 కోట్లను నాడు -నేడు పథకానికి మళ్ళించిందని విమర్శించారు.

కమ్యూనిటీ హాలుకు ఎన్ఆర్ఐ వితరణ

ప్రజాశక్తి దుగ్గిరాల : మండల కేంద్రం దుగ్గిరాలలో కమ్యూనిటీహాల్ నిర్మాణానికి ఎన్ఆర్ఐ చింతమనేని పిచ్చయ్య చౌదరి తన తండ్రి చింతమనేని అప్పారావు జ్ఞాపకార్థం రూ.10 లక్షలు వితరణగా ప్రకటించారు. గురువారం జరిగిన ఒక కార్యక్రమంలో పిచ్చయ్య చౌదరి తల్లి అప్ప మాంబా మొదటి విడతగా రూ.ఐదు లక్షలు చెక్కును విమలానంద ఆశ్రమ కమిటీ నిర్వాహకురాలు జంపాల కుసుమ కుమారి కి అందజేశారు. మరో రూ.ఐదు లక్షలు తదుపరి ఇవ్వనున్నారు. ఈ వేదికలో ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు మహిళలకు ఉపాధి, శిక్షణ, వైద్య సదుపాయాలు లాంటి ప్రజా ప్రయోజనాల కోసం ఉపయోగించనున్నట్లు తెలిపారు.

నేరాలను నియంత్రించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-తెనాలి

ఎమ్మెల్యేను కలిసిన ఎస్ఐ రమేష్‌బాబు

ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో తెనాలి రెండవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన టి. రమేష్‌బాబు గురువారం మర్యాద పూర్వకంగా స్థానిక శాసన సభ్యులు అన్నాబత్తుని శివకుమార్‌ను కలిశారు. ఏఎస్ఎన్ కళాశాల ఆవరణలో కలిసిన ఎస్ఐను ఆయన అభినందించారు. నేర నియంత్రణకు బాధ్యతాయతంగా పనిచేయాలని ఎమ్మెల్యే ఆయనకు సూచించారు. ఆయన వెంట స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

ఎమ్మెల్యే ఆర్కే ఆర్థిక సాయం

ప్రజాశక్తి - మంగళగిరి

పట్నంలోని రత్నాల చెరువులోని నిరుపేదలైన నలుగురు అనారోగ్యానికి గురైనారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి స్పందించి గురువారం కే ముత్తయ్య, ఏం ప్రకాష్ రావు, షేక్ జానీ, మెహ్రూన్ లకు వైసీపీ నాయకులు చేత మనిషికి రూ.5వేలు చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు మునగాల మల్లేశ్వరరావు, ఎండి ఫిరోజ్, ఎం సుధారాణి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షునిగా కృష్ణారావు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా కే కృష్ణారావు నియామకమయ్యారు. ఈ మేరకు గురువారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు లింగం శెట్టి ఈశ్వరరావు నియామక పత్రాన్ని కృష్ణారావుకు అందజేశారు. కార్యక్రమంలో నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సలీం, పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు గోలి సాంబశివరావు, జి అర్జున్ రావు పాల్గొన్నారు.

రేపు గుంటూరులో రైతు సదస్సు

ప్రజాశక్తి -పొన్నూరు రూరల్

రెండు ఎకరాల లోపు సాగు చేసే రైతు కౌలు రైతులకు రూ. 20 వేలు సాయమందించాలని, రైతు, కౌలు రైతు సమస్యలు పరిష్కరించాలని గుంటూరు మల్లయ లింగం భవనంలో సదస్సు నిర్వహిస్తున్నామని సిపిఐ, ఎపి రైతు సంఘం నాయకులు తెలిపారు. గురువారం పొన్నూరులో పిఎన్ఎం జిల్లా కార్యదర్శి రామారావు అధ్యక్షతను విస్తృత సమావేశం నిర్వహంచారు. సిపిఐ పొన్నూరు నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలతో రాష్ట్రంలో ప్రతి రైతు రూ.2 లక్షల 65 వేల రుణభారంతో ఉన్నారని, ఆత్మహత్యలలో మన రాష్ట్ర మూడవ స్థానంలో ఉందని తెలిపారు. వీరిలో అత్యధికులు పేద, కౌలు రైతులు ఉన్నారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన మద్దతు ధర అశాస్త్రీయంగా ఉందని, కనీస మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని సత్యన్నారాయణ కోరారు.

పాత్రికేయులు కరిముల్లాకు ఘన నివాళి

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

పొన్నూరు పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ కరిముల్లా సంస్మరణ సభ గురువారం స్థానిక షాదీఖానాలో జరిగింది. పొన్నూరు జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట రాంబాబు అధ్యక్షతన ముందుగా కరిముల్లా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభలో పాల్గొన్న పలువురు మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా పత్రికారంగానికి ఎనలేని సేవలు చేసిన కరిముల్లా చిరస్మరణీయుడని కొనియాడారు. కార్యక్రమంలో న్యాయవాది షేక్ బాజీ సాహెబ్, సిపిఐ, కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఆరేటి రామారావు, జక్కా శ్రీనివాస్, పొన్నూరు ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు పటాన్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్స్ విద్యార్థి సాయిబాబుకు పీహెచ్‌డీ

ప్రజాశక్తి-గుంటూరు

వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ అప్లైడ్ సైన్స్ అండ్ హ్యుమానిటీస్ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ విద్యార్థి షేక్ సాయిబాబుకు విజ్ఞాన్ యూనివర్సిటీ గురువారం పీహెచ్‌డీ పట్టా అందజేసినట్లు యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ తెలిపారు. సాయిబబు 'మినరాలజీ అండ్ జియోకెమిస్ట్రీ ఆఫ్ ద సెడిమెంట్స్ ఇన్ రివర్స్ అండ్ యాష్యురీస్ అలాంగ్ ద ఈస్ట్ కోస్ట్ ఆఫ్ ఇండియా' అనే అంశంపై పరిశోధన చేశారు. యూనివర్సిటీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ ప్రొఫెసర్ ఎన్.సత్యశ్రీ, సివిల్ విభాగానికి చెందిన సీనియర్ సైంటిస్ట్ వీ.పూర్ణచంద్రరావులు సంయుక్త గైడ్‌లుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా సాయిబాబును వర్సిటీ వీసీ ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

సాయిబాబుకు పిహెచ్‌డి పట్టా అందజేస్తున్న వీసీ తదితరులు

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థినులతో కళాశాల యాజమాన్యం, కంపెనీ ప్రతినిధులు

అభ్యుదయ కాలేజీలో ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి-గుంటూరు : అద్వైత్ స్కిల్ హబ్ స్థానిక లక్ష్మీపురంలోని అభ్యుదయ మహిళా కాలేజిలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 50 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలియజేశారు. ఆఫీస్ అడ్మిన్, స్కూల్ అడ్మిన్, సాఫ్ట్ స్కిల్ ట్రైనర్ పోస్టులకు 150 మంది ప్రాంగణ ఎంపిల్లో పాల్గొనగా 50 మంది అర్హత సాధించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ మేనేజర్ అజయ్, ప్లేస్‌మెంట్ ఇన్‌ఛార్జి మధులత, కళాశాల యాజమాన్యం బిఎస్ఆర్‌కె ప్రసాద్, బి.రోహిణీదేవి, అధ్యాపకులు ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

క్యూఎఐ గుర్తింపు పత్రాన్ని అందుకుంటున్న డాక్టర్ విజయ

అంకినీడు స్ట్రోక్ సెంటర్‌కు జాతీయ స్థాయి గుర్తింపు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ గ్రూప్ వారి అంకినీడు స్ట్రోక్ సెంటర్‌కు క్వాలిటీ అక్రిడిటేషన్ అండ్ ఇన్‌స్టిట్యూట్ (క్యూఎఐ) జాతీయ స్థాయిలో అడ్వాన్స్ స్ట్రోక్ సెంటర్‌గా గుర్తింపు ఇచ్చింది. ఈమేరకు ఈనెల 17న ముంబాయి ట్రైడెంట్ హోటల్లో జరిగిన కార్యక్రమంలో ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్, ఇండియన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీ, దేశంలోని స్ట్రోక్ లీడర్లు ప్రముఖ న్యూరాలజిస్ట్, అంకినీడు స్ట్రోక్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ విజయను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా లలితా హాస్పటల్‌లో గురువారం సాయంత్రం జరిగిన మీడియా సమావేశంలో డాక్టర్ విజయ మాట్లాడుతూ భారత దేశంలోనే క్యూఎఐ ద్వారా అడ్వాన్స్ స్ట్రోక్ సెంటర్‌గా గుర్తింపు పొందిన మొదటి సంస్థగా అంకినీడు స్ట్రోక్ సెంటర్ నిలించిందన్నారు. 24 గంటలు అందుబాటులో ఉంటూ, ఎమర్జెన్సీ సిటి స్కాన్, అధునాతన ఇమేజింగ్-128 స్లైస్, సినీ సిటి యాంజియోగ్రామ్, అత్యాధునిక న్యూరో క్యాథ్‌ల్యాబ్, స్ట్రోక్ ఎంఆర్ఐ, ఎంఆర్ యాంజియోగ్రామ్, కరోటిడ్ డ్యూప్లెక్స్, అల్ట్రాసౌండ్, సెరిబ్రల్ యాంజియోగ్రఫీ, డిఎస్ఎ, 2డి ఎకో, లాబరేటరీ, సర్వీస్ వంటి సౌకర్యాలతో అంకినీడు స్ట్రోక్ సెంటర్ పక్షవాత పేషెంట్లకు నిరంతర సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. అంకినీడు స్ట్రోక్ సెంటర్ అనేక మైలురాళ్ళ దాటి ఇప్పుడు అండియాలోనే అత్యాధునికి స్ట్రోక్ సెంటర్‌గా గుర్తింపు పొందిందన్నారు. 1996లో పక్షవాతం రోగులకు ప్రత్యేక ఐసియు చికిత్స మొదటి స్ట్రోక్ యూనిట్ ప్రారంచామని, 2004లో మొదటి క్లాట్ బస్టింగ్ డ్రగ్ ట్రీట్మెంట్ ఐవి థ్రోంబోలైసిస్ ప్రారంభించబడిందన్నారు. ఇండర్వెన్షనల్ స్ట్రోక్ థెరపీలను 2005లో ప్రారంభించి, సౌత్ ఈస్ట్ రీజియన్‌లోని కొన్ని కేంద్రాల్లో ఒకటిగా నిలిందని చెప్పారు. ఆరోగ్య శ్రీ ద్వారా కూడా పక్షవాతం చికిత్సలు చేస్తామన్నారు. పక్షపాతం గురించి ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆహారపు అలవాట్లు, జీవన విధానం వల్ల 20 నుంచి 40 ఏళ్లలోపు వారికి కూడా పక్షవాతం వచ్చే అవకాశం ఉందన్నారు.

అటవీ భూములను సంరక్షించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో అటవీ భూముల సంరక్షణకు అటవీశాఖ అధికారులను సమన్వం చేసుకుంటు రెవెన్యూ ఇతర శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన జిల్లా అటవీ రక్షణ కమిటీ సమావేశంలో సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణశర్మ, జిల్లా అటవీశాఖ అధికారి మహబుబ్ బాషా ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అటవీభూముల సరిహద్దుల సమస్య పరిష్కారానికి అటవీశాఖ, రెవెన్యూ, సర్వే శాఖ అధికారులు సంయుక్తంగా క్షేత్ర స్థాయిలో పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణ ప్రాంతాల సమీపంలోని అటవీ భూములు ఆక్రమణలు కాకుండా అటవీ, రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అటవీశాఖ నర్సరీలో ఉన్న మొక్కలను డిస్ట్రిక్ట్ ప్లాంట్ ప్లాంటేషన్ ప్లానింగ్‌లో భాగంగా జిల్లాలోని పాఠశాలలో, ప్రభుత్వ కార్యాలయ అవరణలోను, ఉపాధి హామీ పదకం ద్వార చేపట్టే ఎవెన్యూ ప్లాంటేషన్లో, పేదంలందరికీ ఇళ్ల పథకం లే అవుట్ లలో ,నివాస ప్రాంతాల్లోను పెద్ద ఎత్తున నాటేందుకు ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు మధుసూదనరావు, అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి రవీందర్, సర్వే శాఖ ఏడీ నాగశేషు, ఆర్డీవో ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

పేరేచర్ల కొండల్లో పర్యావరణం

20వేల మొక్కలు నాటిన ఇంటెల్ పబ్లిక్‌స్కూలు విద్యార్థులు

ప్రజాశక్తి - మేడికొండూరు

మొక్కలు నాటడంతోనే భూభాగం మీద పచ్చదనం పెరిగి పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని ఇంటెల్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ డాక్టర్ కె జయ కుమార్ చెప్పారు. మండలంలోని పేరేచర్ల ఇంటెల్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు 20 వేల మొక్కలను పేరేచర్ల కొండ ప్రాంతంలో పండుగ వాతావరణం లాగా గురువారం నాటారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ డాక్టర్ కె.జయ్ కుమార్ మాట్లాడుతూ భూ భాగం పైన పచ్చదనం శాతాన్ని మొక్కలు నాటడం ద్వారా పెంచుకోవచ్చని తెలిపారు. అదే విధంగా ప్రతి ఒక్కరు మొక్కలు నాటే స్వభావాన్ని అలవర్చుకోవాలని అన్నారు. గడచిన రెండు రోజుల నుండి తమ స్కూలులోని 4 వందల మంది విద్యార్థులు 20వేల మొక్క మొక్కలను నాటారన్నారు. మొక్కలు పెంపకంపై ప్రజల్లో చైతన్యం పెరగాలని, దానిద్వారా పర్యావరణ పరిరక్షణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఇంటెల్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ కోనూరు రాణి జయకుమార్, పిఇటి షేక్ హుస్సేం పాల్గొన్నారు.

టిజెపిఎస్ కాలేజీకి నూతన యాజమాన్యం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక పట్టాభిపురంలోని టి.జె.పి.యస్ కళాశాలకు నూతన యాజమాన్యం ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఏ.బిపిమనోహర్ తెలియచేశారు. కళాశాల అధ్యక్షులుగా పోలిశెట్టి శ్యాంసుందర్, సెక్రటరీ, కరెస్పాండంట్‌గా కె.వీర బ్రహ్మం, వాసవి విద్యానిధి కమిటీ అధ్యక్షులుగా పొట్టి సుబ్రహ్మణ్యం గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో సెక్రటరీ వీరబ్రహ్మం మాట్లాడుతూ 52 ఏళ్ల చరిత్ర కలిగిన టి.జె.పి.యస్. కళాశాల ఎంతో మంది విద్యార్థులకు విద్యాబోధన అందించి, మంచి జీవితాలను ఇచ్చిందని, ఇటువంటి గొప్ప కళాశాలకు తాను సెక్రటరీగా ఉండటం తన అదృష్టమని చెప్పారు. సామాజిక విద్యా సేవా దృక్పధంతో ఏర్పడిన ఈ కళాశాలలో తక్కువ ఫీజులతో విద్యా బోధన చేస్తున్నట్లు చెప్పారు. ఇంటర్, డిగ్రీ, పి.జి. వంటి కోర్సులు తక్కువ ఫీజులతో, నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. అంతే కాకుండా యన్.యస్.యస్, యన్.సి.సి. స్పోర్ట్స్, ప్లేసెమెంట్స్‌సెల్స్ వంటివి విద్యార్థుల అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తున్నాయని, ఆహ్లాదకరమైన వాతావరణం, సి.సి. కెమెరాల పర్యవేక్షణలో విద్యా బోధన, స్టడీఅవర్స్, మంచి మెటీరియల్, విశాలామైన గ్రంథాలయం, నెలకు రెండు సార్లు మోటివేషన్ తరగతులు ఉంటాయన్నారు. వెనుకబడిన విద్యార్థులకు వ్యక్తిగత పర్యవేక్షణ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజి, కంప్యూటర్స్, ఎలక్ట్రానిక్స్ విభాగాలకు అధనాతన ల్యాబ్స్ వంటివి తమ కళాశాల ఉన్నాయని, ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. పి.జి.లోతో పాటు, యం,ఫిల్, బి.ఇ.డి, యం.ఇ.డి. అర్హతలు ఉన్నటువంటి అధ్యాపకులు ఉన్నారని చెప్పారు. మంచి ర్యాంకులు వచ్చిన వారికి, పేద విద్యార్థులకు సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్. ప్రిన్సిపాల్ బాను మురళి, యన్.యస్.యస్. కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్. జె. వి. సుధీర్ కుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కాలేజి సెక్రెటరీ, కరస్పాండెంట్ తదితరులు

పల్నాడు జిల్లాలో తొలివిడతగా

240 మంది జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు

జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి

ప్రజాశక్తి - నరసరావుపేట

పల్నాడు జిల్లాలో తొలివిడతగా 240 మంది విలేకరులకు అక్రెడిటేషన్లు మంజూరు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీ సమావేశానికి జిల్లా కలెక్టర్ శివశంకర్ అధ్యక్షత వహించారు. కమిటీ 131 మంది ప్రింట్ మీడియా జర్నలిస్టులు, 101 మంది ఎలాక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల, 6 గురు ప్రభుత్వ మీడియా ప్రతినిథులు, ఇద్దరు వెటరన్ జర్నలిస్టులు కలుపుకుని మొత్తం 240 మంది అక్రెడిటేషన్ల దరఖాస్తులకు ఆమోదం తెలిపిందన్నారు. అర్హత కలిగి ఆన్ లైన్‌లో దరఖాస్తులు సరిగా నింపని జర్నలిస్టులు, చిన్న పత్రికలు, పీరియాడికల్స్ మరియు కేబుల్ ఛానెళ్లకు మలి విడత కమిటీలో అక్రెడిటేషన్లు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఆర్వో వినాయకం, కమిటీ సభ్యులు ఆర్. లవ కుమార్ రెడ్డి (సాక్షి పత్రిక), పచ్చవ బుజ్జిబాబు (ప్రజాశక్తి), నుసుం సుంకురెడ్డి (సాక్షి టీవీ), బి.ఎన్ ప్రసాద్ (టీవీ9), కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ ధనలక్ష్మి, జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ సునీల, కమిటీ కన్వీనర్ దీప్తి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పల్నాడు జిల్లా కలెక్టర్